
ముమ్మరంగా దర్యాప్తు



దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన రాయచోటిలో ఉగ్రవాదుల అరెస్టు కేసు దర్యాప్తు ముమ్మరంగా జరుగుతోంది. తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలలో అనేక బాంబుపేలుళ్ల సంఘటనల్లో నిందితులుగా ఉండి అక్కడి పోలీసుల కన్నుగప్పి 30 సంవత్సరాలుగా రాయచోటిలో నివాసం ఉండడంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకోవడంతో వారందరినీ కేంద్ర దర్యాప్తు సంస్థలు క్షుణ్ణంగా విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం పోలీసులు అదుపులోకి తీసుకున్న అందరినీ విడిచిపెట్టినట్లు తెలిసింది. అయితే విడిచిపెట్టిన వారిపై నిఘా ఉంచడంతో పాటు గత పదేళ్లుగా రాయచోటిలో జరిగిన పాత గొడవల కేసులను సైతం తోడుతున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో రెండు వారాలుగా స్తబ్దుగా ఉన్న ఉగ్రవాదుల అరెస్టు వ్యవహారం మళ్లీ తెరపైకి వస్తోంది.

- ఉగ్రవాదుల కేసులో.. చాపకింద నీరులా విచారణ
- పాత కేసులను తోడుతున్న వైనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దక్షిణ భారతదేశంలో అనేక రాష్ట్రాలలో గతంలో నమోదైన బాంబుపేలుళ్ల కేసుల్లో నిందితులైన అబూబకర్ అలియాస్ అమానుల్లా, మహ్మద్ అలీ అలియాస్ మన్సూర్‌లను తమిళనాడు ఐబీ పోలీసులకు అన్నమయ్య జిల్లా పోలీసులు పట్టించారు. అనంతరం ఉగ్రవాదుల ఇళ్లలో జరిపిన సోదాల్లో కొత్తపల్లెలో నివాసం ఉంటున్న అబూబకర్ అలియాస్ అమానుల్లా ఇంట్లో రెండు బాంబులు, పెద్ద ఎత్తున బాంబుల తయారీ సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ అలీ అలియాస్ మన్సూర్ ఇంట్లోనూ కొన్ని పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రాయచోటి అర్బన్ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. దాదాపు మూడు దశాబ్దాలుగా రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులు ఎవరికీ తెలియకుండా సురక్షితంగా ఉండడం పోలీసులను ఆశ్చర్య పర్చింది.

పోలీసుల అదుపులో అనుమానితులు

ఈ సంఘటన తర్వాత రాష్ట్రమే కాకుండా దేశమే ఉలిక్కిపడిందని చెప్పవచ్చు. సకాలంలో పోలీసులు స్పందించి ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణనష్టం తప్పిందనే చెప్పవచ్చు. పోలీసులు బాంబులను స్వాధీనం చేసుకోకుండా ఉండి ఉంటే దేశంలోని పలు ముఖ్యనగరాలలో వీటిని ఉగ్రవాదులు పేల్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను అరెస్టు చేసిన వెంటనే వాళ్ల భార్యలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అమానుల్లా చిల్లర దుకాణం, మన్సూర్ చిల్లర దుకాణం, బట్టల దుకాణం నడుపుతూ ఉండడంతో వీళ్లతో సన్నిహితంగా మెలిగిన పలువురిని సైతం అదుపులోకి తీసుకున్నారు. 30 సంవత్సరాలలో వీళ్లు ఎక్కడెక్కడ నివాసం ఉన్నారు. ఆ ఇళ్లను వీళ్లకు అద్దెకు ఏర్పాటు చేసింది ఎవరు? వీళ్లకు ఇక్కడ పెళ్లిళ్లు జరిపించింది ఎవరు? ఫోన్ సిమ్ కార్డులను ఏర్పాటు చేసింది ఎవరు? ఇలా అనేక కోణాలలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేసి పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. తర్వాత కేంద్ర, రాష్ట్ర సంస్థలు రంగంలోకి దిగాయి. కేంద్ర ఇంటెలిజెంట్స్ విభాగంతో పాటు సీఐడీ, ఎస్‌ఐబీ ఇలా అనేక విచారణ సంస్థలు రాయచోటిలోనే మకాం వేశాయి. ఉగ్రవాదులు తమిళనాడు జైలులో ఉండడంతో ఇంకా వారిని కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ కోసం అదుపులోకి తీసుకోలేదు. అయినా ప్రాథమికంగా ఉన్న సమాచారం మేరకు పోలీసులు చాలా లోతుగా విచారణ చేపట్టారు. ఈ విచారణ తర్వాత అదుపులోకి తీసుకున్న సుమారు 40 నుంచి 50 మందిని పోలీసులు విడిచిపెట్టినట్లు తెలిసింది. వీళ్ల ద్వారా కొంత సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ఇంకా అనుమానితులపైన పోలీసుల నిఘా కొనసాగుతున్నట్లు సమాచారం.



రాయచోటిలో ఉగ్రవాది మహ్మద్ అలీకి చెందిన దుకాణం

పాత కేసులు తోడుతున్నారా?

30 సంవత్సరాలుగా ఉగ్రవాదులు ఇక్కడే నివాసం ఉండి ఇక్కడే పెళ్లిళ్లు చేసుకుని.. పిల్లలను కూడా కనడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఉగ్రవాదులతో స్థానికులు ఎవరికైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో క్షుణ్ణంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గత పది సంవత్సరాల కిందట రాయచోటి ఠాణా సర్కిల్‌లో జరిగిన ఘర్షణ కేసులో రాయచోటి పోలీసులు వందలాది మందిపైన కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసులను గత ప్రభుత్వంలో ఉపసంహరించుకున్నారు. అయితే ఈ సంఘటనలోని నిందితులు ఎవరిపైన అయినా ఉగ్రవాదుల ప్రభావం ఏమైనా ఉందా? అని ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ఇటీవల అయ్యప్పస్వాముల ఊరేగింపు, వీరభద్ర స్వామి ఊరేగింపు సందర్భంగా కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరిగి పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వీరభద్రస్వామి ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘర్షణల విషయమై పోలీసులు రెండు వర్గాలపైనా కేసులు నమోదు చేశారు. ఈ ఘర్షణల్లో ఉన్న వారిలో ఎవరైనా ఉగ్రవాదులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారా? అని కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు రాయచోటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అమాయకులు ఎవరికైనా తమ విషపు భావజాలాన్ని ఎక్కించారా? అనే కోణంలోనూ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులను కేంద్ర దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారిస్తే.. ఇక్కడ వారి అనుచరులు, సానుభూతిపరుల జాడ బయటపడే అవకాశముంది.

వైభవం.. వీరభద్రుడి పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు వేదమంత్రాల మధ్య వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి బ్యాండు మేళాలతో మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హమాలీలకు జీతాలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన

రాయచోటి (కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సివిల్ సప్లయిస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీలకు ఇరవై రోజులు దాటినా ఇంతవరకు జీతం చెల్లించలేదని, యూనిఫాం కుట్టు కూలి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించడం ఆలస్యమవుతోందని, సివిల్ సప్లయిస్ డీటీలు 3వ తేదీలోపు బిల్లులు పెట్టాలని కోరారు. మొదటివారంలోనే జీతాలు చెల్లించాలని పలు దఫాలుగా సివిల్ సప్లయిస్ డీఎంకు తెలియజేసినా ఆలస్యం జరుగుతూనే ఉందని ఆరోపించారు. రెండు నెలల క్రితం తిరుపతి జిల్లా ఏర్పేడు సివిల్ సప్లయిస్ పాయింట్లలో పనిచేసిన సన్న బియ్యం ప్యాకింగ్, లోడింగ్ చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణయ్య, అయూబ్, నాగరాజు, చలపతి, సూరి, రాజేశ్, రాజు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

కూటమిపై విషం చిమ్మే మాటలు మానుకో

- రమేశ్‌కుమార్‌రెడ్డికి కూటమి నేతల సూచన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు శ్రీరాంచినబాబు, గంగారపు రామ్‌దాస్‌చౌదరి, సీడ్స్ మల్లికార్జున నాయుడు

మదనపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థాయిని మరచి కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మే మాటలు మానుకోవాలని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి కూటమి నేతలు సూచించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై రమేశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూటమి నేతలు ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సీడ్స్ మల్లికార్జుననాయుడు సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం, మంత్రులను విమర్శించే స్థాయి, అర్హత రమేశ్‌కుమార్‌రెడ్డికి లేదని, అయితే జగన్‌మోహన్‌రెడ్డి నుంచి మార్కులు కొట్టేయడానికి, లిక్కర్‌స్కాంలో అరెస్టు అయిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలపై ఉన్న ప్రజల దృష్టిని మళ్లించడానికి అలా మాట్లాడారని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లూ ఆయన వైసీపీతో అంటకాగారని, రోడ్ల కాంట్రాక్టు పనులు, క్వారీలు అన్నీ నడిచాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని పగలంతా తిడితే, రాత్రివేళలో ఇద్దరూ భాగాలు పెట్టుకునే వారని మల్లికార్జుననాయుడు విమర్శించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, తీరు మార్చుకోకపోతే పరిస్థితులు దారుణంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో రాజంపేట పార్లమెంటు జనరల్ సెక్రటరీ వై.దొరస్వామినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, నాగూర్‌వలి, తాళ్ల హిమగిరి, జనసేన నాయకులు అడపా సురేంద్ర, గజ్జల రెడ్డెప్ప, గ్రానైట్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పతనమైన చీనీ ధరలు

- వారం క్రితం టన్ను రూ.20 వేల నుంచి రూ.27 వేలు
- ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.20 వేల లోపే
- ధర తగ్గడంపై రైతుల ఆందోళన

చీనీ రైతులు రోజురోజుకు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ధర ఉంటుందో ఎప్పుడు ఉండదో అంతుబట్టక ఆవేదన చెందుతున్నారు. పులివెందుల మార్కెట్‌లో వారం క్రితం వరకు టన్ను రూ.20 వేల నుంచి రూ.27 వేలు పలికింది. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.20 వేల లోపే పడిపోయింది. సీజన్ క్రాప్ చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం రైతులను తీవ్రంగా కలచివేస్తోంది.



పులివెందుల మార్కెట్‌యార్డులో అమ్మకానికి వచ్చిన చీనీకాయలు

పులివెందుల, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పులివెందుల ప్రాంతం చీనీ సాగుకు పెట్టింది పేరు. పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 20వేల ఎకరాల్లో చీనీతోటలు సాగులో ఉన్నాయి. చీనీతోటలు సాగుచేసిన ఐదేళ్లపాటు దిగుబడి రాకపోయినా రైతులు కన్నబిడ్డల్లా చూసుకుంటారు. కానీ దిగుబడులు వచ్చే సమయంలో రైతులకు ధర కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రెండేళ్లుగా దిగుబడి ఉన్న సమయంలో ధరలు దారుణంగా పడిపోతున్నాయి. తోటల్లో దిగుబడి లేని సమయంలో ధర ఎక్కువగా ఉంటోంది. మరీముఖ్యంగా పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ వ్యాపారం ప్రారంభించినప్పటి నుంచి దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం వరకు పులివెందుల మార్కెట్‌లో టన్ను చీనీధర రూ.20 వేల నుంచి రూ.27వేల వరకు ఉండేది. కానీ వారం రోజులుగా ధర పడిపోయింది. ప్రస్తుతం పదివేల నుంచి ఇరవై వేలలోపు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబరు నెలలో కాపు వచ్చిన పంట ప్రస్తుతం కోత దశకు చేరింది. అక్టోబరు నాటికి పంట పూర్తిగా మార్కెట్‌కు తరలించాల్సిందే. లేదంటే తోటల్లోనే కాయలు రాలిపోతాయి. ఈ సమయంలో పంటకు ధర ఉంటేనే రైతులకు లాభాలు వస్తాయి. లేదంటే నష్టాలు చవిచూడాల్సిందే. ఒకపక్క ఎరువుల ధరలు, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో.. మరోవైపు దిగుబడుల ధరలు పతనం అవుతుండటంతో చీనీ రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో లింగాల, సింహాద్రిపురం మండలం చీనీ పంటకు పెట్టింది పేరు. ప్రస్తుతం లింగాల రైతులు దాదాపు చీనీ తోటలను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. వీటి స్థానంలో అరటిసాగుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెట్ యార్డులో దళారుల బెడద తగ్గించి చీనీకాయలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం కాకుళారం గ్రామానికి చెందిన సుమలత తాను అంగన్వాడీ సహాయకురాలిగా పని చేస్తున్నానని, తనకు తల్లికి వందనం నగదు రాలేదని, నగదు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. నందలూరు మండలం పాటూరు గ్రామ పంచాయతీకి చెందిన నరసింహులు తాను పల్లెపండుగ కార్యక్రమంలో రహదారి నిర్మాణం చేశానని, తనకు రావాల్సిన నగదు ఇంతవరకు రాలేదని నగదు తనకు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కేవీపల్లి మండలానికి చెందిన బాషా తనకు రెండు కాళ్లు లేవని, పేదవాడినని, ద్విచక్రవాహనాన్ని తనకు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించండి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



దివ్యాంగుడి దగ్గరకు వచ్చి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించి బాధితులకు సత్వరం న్యాయం చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే బాధితుల్లో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెద్దమండెం మండలంలోని కలిచర్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు చీమలచెరువు గంగాధర్ నడవలేని పరిస్థితిలో తన సమస్యను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అతడి వద్దకే వెళ్లి సమస్య తెలుసుకుని చట్ట పరిధిలో సమస్యను పరిష్కరించాలని ములకలచెరువు సీఐని ఆదేశించారు.

పేదలకు సంక్షేమ పథకాల అమలు

- మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

మదనపల్లె టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటును అధిగమించి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ శాఖల మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ తెలిపారు. సోమవారం మదనపల్లె మండలం కోళ్లబైలు-1 గ్రామ పంచాయతీ జామతోట కాలనీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు. అయినా సీఎం చంద్రబాబు రూ.70వేల కోట్లు వెచ్చించి పేదల సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాయలసీమలో సాగు, తాగునీరు అందించడానికి హంద్రీనీవా ప్రాజెక్టు పనులు వేగం చేశారని గుర్తు చేశారు. మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.850 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లెలో చేనేత కార్మికుల కోసం 200 యూనిట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాటకొండ శ్రీనివాసులు, నాదెళ్ల విద్యాసాగర్, నందకుమార్, షంషీర్, నాదెళ్ల శివన్న, సహదేవ, నాగూర్‌వలి, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఎఫ్‌సీలు ఇక్కడే ఇవ్వాలి

ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు) మదనపల్లెలోనే మంజూరు చేయాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మంత్రి ఫరూక్‌కు విన్నవించారు. మంత్రిని కలసిన అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఆటోల నుంచి లారీల వరకు ప్రతి సంవత్సరం ఎఫ్‌సీల కోసం రాయచోటికి వెళ్లాల్సి వస్తోందని, దీని వలన అధికంగా ఖర్చులు వస్తున్నాయన్నారు. దీనిపై ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌తో మాట్లాడి తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

9 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

- 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం

రైల్వేకోడూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లె రెంజ్ పరిధిలో సోమవారం 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్.ఐ. కృపానంద తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ ఎస్‌ఐ ఎన్.బాలచెన్నయ్య, స్థానిక ఎఫ్‌బీవో సుబ్బలక్ష్మితో కూంబింగ్ నిర్వహిస్తుండగా దేశెట్టిపల్లి ఫారెస్ట్ బీటు పరిధిలోని బాలపల్లె అటవీ ప్రాంతంలో అనుమానంగా అటవీలో రెండు కార్లు వెళ్తుండగా గమనించి వాహనంలో ఉన్న 16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని నంద్యాల, అన్నమయ్య జిల్లాలు, కర్నాటకకు చెందిన 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.



ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో అటవీ శాఖ సిబ్బంది

పీలేరు సొగసు చూడతరమా..!



- రోడ్లపై మురుగు ప్రవాహం 6
- చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్ స్టేషన్

పీలేరు సొగసు చూడతరమా..!

'ప్రముఖ విద్యా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణం ఒక్క రాత్రి కురిసిన వర్షానికి ఉక్కిరిబిక్కిరైంది. జనం కంటి మీద కునుకు లేకుండా పోయింది. పట్టణంలోని పలు ప్రధాన వీధులు మురుగు కాలువలను తలపించాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్ స్టేషన్ చెరువును తలపించింది. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రధాన రహదారి నుంచి ఎస్వీ మహల్, సత్యప్రియ లాడ్జి, గుప్త హాస్పిటల్, ఎస్వీ డీలక్స్ మార్గం రూపురేఖలు మురుగునీటి ధాటికి పూర్తిగా మారిపోయాయి. కట్టుకాలువ వీధి, గోరీల తోపు, రాజీవ్‌నగర్ కాలనీ రహదారిపై మురుగునీటి ప్రవాహంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ శివారులోని మోడల్ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో జనం కష్టాలపాలయ్యారు.


పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

- రోడ్లపై మురుగు ప్రవాహం
- చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్ స్టేషన్
- వీధుల్లో మేట వేసిన ఇసుక
- మోడల్ కాలనీలో ఇళ్లలోకి.. వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు

పీలేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంలో నాలుగు చినుకులు పడినా పట్టణమంతా మురుగుమయమవుతోంది. మురుగు కాలువల ఆక్రమణలు, ముందు చూపులేకుండా సీసీ రోడ్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం వల్లే సమస్య జటిలంగా మారుతోంది. గురువారం రాత్రి 66 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పట్టణంలోని మురుగు కాలువలు, వీధులు ఏకమై పలు ప్రాంతాల్లో ఇసుక మేట వేసింది.

చెరువులా ఆర్టీసీ సముదాయం..

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటే ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం చెరువును తలపిస్తుండగా, దుకాణాల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ నల్లగుట్ట శ్రీకృష్ణదేవరాయనగర్, క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల నుంచి వర్షపునీరు, మురుగు బస్‌స్టేషన్‌లోకి రాకుండా నివారణ చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమౌతున్నారు.

రోడ్లపై ఇసుక మేటలు...

పట్టణంలో పలు చోట్ల ఇసుక మేట వేయడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని తిమ్మారెడ్డి క్రాస్, పోలీస్ క్వార్టర్స్, కడప రోడ్, కోటపల్లె మార్గం, రైల్వే అండర్ బ్రిడ్జి, యల్లమంద క్రాస్, ట్రెండ్స్ తదితర ప్రాంతాలలో రహదారిపై ఇసుక మేటలతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కాలువలను తలపిస్తున్న వీధులు..

పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ, గోరీల తోపు మార్గం పూర్తిగా మురుగు నీటితో నిండిపోయాయి. దీంతో పాదచారులు, వాహన చోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటపల్లె మార్గంలో మురుగు కాలువలు, వీధులు ఒక్కటయ్యాయి. ఎక్కడికక్కడే మురుగు నీరు రోడ్లపై నిలిచిపోయింది. చిత్తూరు, మదనపల్లె మార్గంలో, ఆర్వోబీ పనులు జరుగుతున్న ప్రాంతాలు వర్షంధాటికి ప్రమాదకరంగా మారాయి.

అధికారుల నిర్లక్ష్యం...

అధికారులు కార్యాలయాలకే పరిమితమై, సమస్యలపై దృష్టి సారించకపోవడమే ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెట్టుకోవడం వల్లే సమస్య జటిలంగా మారిందని అంటున్నారు.



కోటపల్లె, యల్లమంద క్రాస్ వద్ద రోడ్డుపై మురుగు

ప్లాస్టిక్ వ్యర్థాలు.. ఆక్రమణలే కారణం



ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడేయడం, మురుగు కాలువలు ఆక్రమణల బారిన పడడంతోనే మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. పీలేరు గ్రామ పంచాయతీ అధికారులతో పాటు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

- గోపీనాథరెడ్డి, రిటైర్డ్ ఈఈ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్


మురుగును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రైతుల సంక్షేమం కోసమే 'పీఎం ప్రణామ్'

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అగ్రికల్చర్ జేడీలు

రాయచోటి(కలెక్టరేట్), జూలై21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం ప్రణామ్ స్కీమ్ ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పచ్చిరొట్ట జీవన ఎరువుల గోడ పత్రికను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బయో ఎరువులు, సేంద్రియ ఎరువులతో కలిపి ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ స్కీం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ పథకం ద్వారా కృత్రిమ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశమన్నారు. దీంతో ఆరోగ్యమైన నేలతో పాటు భూసారం, పోషకాల లభ్యత పెరిగి నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని కలెక్టర్ తెలిపారు.

పారిశుధ్యం తీరుపై కేంద్ర బృందం అసహనం


గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణనెల్లూరు గ్రామ పంచాయతీలో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. రెండు అంగన్వాడీ కేంద్రాలు, ఒక ఎలిమెంటరీ పాఠశాల, హెల్త్ సెంటర్, చెత్త సేకరణ కేంద్రాలను తనిఖీ చేసింది. కొన్ని కుటుంబాలు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా పరిశీలించి. అన్నిచోట్ల పారిశుధ్యం సరిగా లేదని, దానిపై ప్రజలకు సరైన అవగాహన కల్పించలేదని ఈ సందర్భంగా బృంద సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవని స్పష్టంగా తెలుస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు మినహా మిగిలినవారు లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే టైపిస్టు అనిత కేంద్ర బృందానికి సహకరించారు. ఈ విషయంపైన కూడా సంబంధిత అధికారులు లేకుండా శాఖలకు సంబంధం లేని వారు సమాధానం చెప్పడంపై కూడా వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ శానిటేషన్ టీమ్ సభ్యులు ఎం.సుబ్బరాయుడు, స్వచ్ఛభారత్ గ్రామీణ కన్సల్టెంట్ బి.మద్దిలేటి, గ్రామ సర్పంచ్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఈశ్వరప్ప

తంబళ్లపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): తంబళపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు మల్లయ్యకొండకు వచ్చి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప స్వామి వారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. కొండపైన గౌరమ్మ అమ్మవారికి, ఏనుగు మల్లమ్మకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మునిరాజ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఉజ్జయిని మహంకాళికి ఆషాఢం సారె


ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెస్తపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి ఉజ్జయిని మహంకాళికి ఆదివారం రాత్రి సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆషాఢమాస సారె కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు స్థానిక అనంతపురం గంగమ్మ దేవాలయం నుంచి మంగళవాయిద్యాలతో మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు, పసుపు కొమ్ములు, తాలిబొట్టు, దారం, వడిబియ్యం, పూలు, పండ్లతో పాటు మంగళకరమైన వస్తువులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజన సహ ప్రముఖ జయరామిరెడ్డి, బాలవికాస ఉపాధ్యాయ జిల్లా సహ కన్వీనర్ వెంకటరమణయ్య, రాజంపేట సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని చాముండేశ్వరిపేటకు చెందిన నారపురెడ్డి రామచంద్రారెడ్డి(60) సోమవారం రాత్రి బాకరాపేట సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కడప చెన్నై జాతీయ రహదారిని దాటుతుండగా తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోయింది. ఈ విషయంపై స్థానికులు హైవే పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించడంతో కడప నగర సమీపంలో బస్సును అదుపులోకి తీసుకున్నారు. మృతిచెందిన వ్యక్తికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు మృతుని బంధువులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు సంఘటనా స్థలాన్ని సందఋదదంచారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

తాగునీరు సరఫరా చేయాలి

- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో క్యాన్‌కు రూ. 20 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందంటూ మండలంలోని మాధవరం-1, పార్వతీపురం, వెంకటేశ్వరపురం, రామకృష్ణపురం గ్రామాలకు చెందిన మహిళలు సోమవారం మండల కేంద్రంలో ఖాళీ బిందెలతో వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించనిపక్షంలో గ్రామ సచివాలయాన్ని ముట్టడిస్తామని, ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్‌ను వివరణ కోరగా మాధవరం గ్రామానికి వెళ్లే పైపులైను సిద్దవటం బ్రిడ్జి సమీపంలో దెబ్బతిందని, దీనికిమరమ్మతులు చేస్తున్నామని మంగళవారం నుంచి క్రమం తప్పకుండా తాగునీరు అందిస్తామని తెలిపారు.

చదువులబాబుకు జీవన సాఫల్య పురస్కారం


డీకే చదువులబాబును సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువులబాబుకు జీవన సాఫల్య జాతీయ సాహిత్య సేవా పురష్కారం ప్రదానం చేశారు. ఆదివారం హిందూపురంలోని సెవన్ స్టార్ ఫంక్షన్ హాలులో భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీ సత్యసాయిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో చదువుల బాబుకు జాతీయ సాహిత్య సేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా, అఖిలభారత టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలికి సన్మానం


నాగూర్‌వలిని సన్మానిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలిని కూటమి నాయకులు సోమవారం కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో దుశ్శాలువలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీ కో- కన్వీనర్ గంగారపు రామదాస్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని, డిపోలోని అన్ని యూనియన్ల నాయకులను కలుపుకుని పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ డిపోల్లో సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకారం అందించిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, టీడీపీనాయకులు సీడ్ మల్లికార్జున నాయుడు, యాలగిరి దొరస్వామినాయుడు, గిరి, బ్యాంకు రమణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ నేత అబ్బవరం రామాంజులు


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపుతో పాటు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 9వ రోజు ఒంటికాలి మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, శంకరయ్య, అక్బర్, చెన్నయ్య, రాంబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీతం పెంపుతో పాటు సామాజిక భద్రతకై సంక్షేమ పథకాల అమలు, వయో పరిమితి 62 ఏళ్ల పెంపు, విధి నిర్వహణలో చనిపోయిన వర్కర్స్‌కు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే అంశం మీద పరిశీలిస్తామనడం సరైంది కాదన్నారు. అన్ని డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె విరమించబోమని తెలిపారు. మున్సిపల్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, తిరుపాల్, మంగమ్మ, రెడ్డిప్రసాద్, లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు, ఆటో ఢీ : ఆరుగురు విద్యార్థులకు గాయాలు



సంఘటనా స్థలంలో బస్సు, ఆటో


108లో తరలుతున్న విద్యార్థులు


పరామర్శిస్తున్న సీడు మల్లికార్జున నాయుడు

కురబలకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సు, ఆటో ఢీకొనడంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అంగళ్లు సమీపంలోని ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన బస్సు సోమవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు తీసుకెళుతుండగా, ముదివేడు క్రాస్ వద్దనున్న మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళుతున్న ఆటో ఇళ్లకు బయలుదేరి నడింపల్లె గ్రామ సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు 108 వాహనంలో విద్యార్థులను మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపక్క నున్న పొలంలో బోరు వేస్తుండడంతో వెలువడిన ధూళి కారణంగా దారి కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- **టీడీపీ నేత మల్లికార్జునాయుడు పరామర్శ**

మదనపల్లె : ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులను తంబళపల్లె నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు పరామర్శించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరుకుని గాయపడిన శివమణి, పల్లవి, లహరి, యశ్వంత్, మంజుల, కేశవ, అమృతను పరామర్శించారు. కురబలకోట మండల టీడీపీ అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, నేతలు దేరంగుల చంద్ర, సోమశేఖర్, రాజారెడ్డి, శివలింగారెడ్డి ఆయనకు సహకరించారు. దీంతో ఆయనను స్థానిక నాయకులు ప్రజలు తదితరులు ప్రశంసించారు

అతివేగం.. నిర్లక్ష్యం..!


చెన్నామర్రి మిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

● నెత్తురోడుతున్న రహదారులు.. ● దివ్యాంగులుగా మారుతున్న యువకులు ● రోడ్డున పడుతున్న కుటుంబాలు

కురబలకోట, జులై 21 (ఆంధ్రజ్యోతి): వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, కునుకు పాటు, మద్యం సేవించడం, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు పరిపాటిగా మారాయి. దీంతో పెద్ద దిక్కు కోల్పోయి పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఎంతో మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం జారీ చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారు తోంది. ముంబై-చెన్నై, కడప- మదనపల్లె మార్గాల్లో ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎంతో మంది అంగ వైకల్యాన్ని పొందారు. ఈ ఏడాది జనవరి నుంచి మండలంలో జరిగిన ప్రమాదాల వివరాలిలా..

- ఈ ఏడాది జనవరి 2న ముదివేడు టోల్‌ప్లాజా వద్ద ఇన్నోవా కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో చేనేత నగర్‌కు చెందిన కార్మికుడు గంగుల్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.
- జనవరి 16న అంగళ్లు సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద ప్రైవేట్ బస్సు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ డంతో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- 22న కురబలకోట ఫ్లై ఓవర్ వద్ద ద్విచక్ర వాహ నం బోల్తాపడి రాయచోటికి చెందిన ఫైజాన్(22), ఫహద్ తీవ్రంగా గాయపడ్డారు.
- ఫిబ్రవరి 4న మండలంలోని దాదాంవారిపల్లెకు చెందిన ఈశ్వరప్ప, రాజేశ్వరమ్మ కారులో బెంగళూ రుకు వెళ్లి తిరిగి వస్తుండగా టైరు పేలడంతో వాహనం అదుపుతప్పి గాయపడ్డారు.
- 14న మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ధర్మపురికి చెందిన సతీష్ కుమార్ గాయపడ్డాడు.
- 21న అంగళ్లు బైపాస్‌రోడ్డులో టెంపో, లారీ ఢీకొనడంతో ములకలచెరువు మండలం రాయపు వారిపల్లెకు చెందిన డ్రైవర్ మనోహర్(25) అక్కడి కక్కడే మృతి చెందాడు.
- మార్చి 18న కడప-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని మద్యాహ్నంవారిపల్లె సమీపంలో కారు, బస్సు ఢీకొనడంతో కడప పట్టణానికి చెందిన జహీర్(27) అక్కడిక్కడే మృతి చెందాడు.
- 20న ముదివేడు క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెంద గా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.
- ఏప్రిల్ 2న రిషివ్యాలీ క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా మండ్యంవారిపల్లెకు చెందిన వెంకటరమణ తీవ్రంగా గాయపడాడు.
- మే 7న అంగళ్లు సమీపంలో రెండు ద్విచక్ర వా హనాలు ఢీకొనడంతో ఇంజనీరింగ్ విద్యార్థి కింద ఎడిపోయాడు. అదే సమయంలో అతనిపై ట్రాక్టర్ వెళ్లడంతో పెద్ద మండ్యం మండలంలోని కలిచెర్ల సమీపంలో శెట్టివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమా రుడు వెంకటరమణ (22)మృతి చెందాడు. సీటీఎం రోడ్డులో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కనసానివారిపల్లె కాలనీకి చెందిన విష్ణువర్ధన్ (24) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అతని స్నేహితులు వెంకటేష్‌బాబు, బాబా ఫక్రుద్దీన్ గాయపడ్డారు.
- 9న దొమ్మన్నబావి సమీపంలో టమోటా లారీ, కారు ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు.
- 21న మండలంలోని ముదివేడు క్రాస్ వద్ద ఐషర్ వాహనం, కారును ఢీకొనడంతో బస్సు కోసం రోడ్డు పక్కన వేచియున్న ములకలచెరువు మండలం చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారి ఎల్లెకు చెందిన వెంకట్రమణ గాయపడ్డారు.
- మే 30న బెంగళూరు నుంచి రాయచోటికి వెళుతుండగా మండలంలోని జంగావారిపల్లె సమీ పంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో రాయచోటికి చెందిన ఖాదర్ కుమారుడు నవాజ్(24) అక్కడిక్కడే మృతి చెందగా, మహమ్మద్ అలీఖాన్(24), ముజిమిల్(24), ఖాదర్‌ఖాన్(24), సుహేల్(24) గాయపడ్డారు.
- జూన్ 30న మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద టెంపో ట్రావెల్, కంటైనర్ ఢీకొనడంతో కర్ణాటక కు చెందిన ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా, 10మంది తీవ్రంగా గాయపడ్డారు.


ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

ఎస్‌హెచ్‌జీ రుణాలతో సాధికారిత

● ఆర్థిక ప్రగతి సాధిస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు



పోరుమామిళ్లలో వెలుగు మహిళా మార్ట్

పోరుమామిళ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భర్త సంపాదనే కాకుండా భర్త కష్టంలో చేదోడు వాదోడుగా ఉంటూ.. ఆ మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు పొందుతూ సాధికారత సాధిస్తున్నారు పోరుమామిళ్ల మండలంలో 1286 స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ బాధ్యతలలో తమ వంతు భాగస్వామ్యులవుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. డ్వాక్రా రుణాలు పొందిన వారు బేకరీలు, బట్టల షాపులు, రెడిమేడ్ షాపులు, చిన్న చిన్న ఫ్యాన్సీస్టోర్‌లు నిర్వహిస్తూ ప్రగతిని సాధిస్తున్నారు. అంతేకాకుండా 18 నెలల క్రితం పోరుమామిళ్లలో వెలుగు మహిళామార్ట్‌ను కూడా ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వం రూ.10లక్షలు పెట్టుబడులు పెట్టగా, 10వేల మంది సంఘ సభ్యులు దాదాపు రూ.15లక్షలు పెట్టుబడి పెట్టారు. మొత్తం రూ.25లక్షల వ్యయంతో ఈ మార్ట్ అభివృద్ధిపథంలో పయనిస్తోంది. ఇందులో వచ్చే లాభాలను అందరికీ భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకుంటూ సంబంధిత అధికారులు ముందుకు సాగుతున్నారు. అంతేకాక ఇదే మహిళా మార్ట్‌లో నలుగురు డ్వాక్రా సంఘాల సభ్యులు పనిచేస్తున్నారు. ఈ నలుగురికి కలిపి నెలకు రూ.28వేలు జీతాన్ని కూడా పొందుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు పొంది ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ప్రస్తుతం మైక్రోక్రెడిట్ ప్లాన్ అమలులో ఉండడంతో 30 గ్రూపులకు చెందిన సభ్యులకు ప్రస్తుతం ఈ మూడు నెలలకు దాదాపు రూ.కోటి 50 లక్షల రుణాలు వచ్చాయి. మిగలిన గ్రూపులకు కూడా రుణాలు అందిస్తే మరింత మంది మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తారని... ఆ దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తినుబండారాల వ్యాపారం చేస్తున్నాం..



డ్వాక్రాలో చేరిన తరువాత తమ ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. 14 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో చేరా. ఐదువేల నుంచి రూ.2లక్షల వరకు రుణాలు పొందే స్థాయికి చేరా. ప్రధానమంత్రి స్కీం ద్వారా తినుబండారాల తయారీకి రూ.10లక్షల విలువైన మిషన్ కూడా వచ్చింది. తన భర్తతో కలిసి మిషన్ రన్ చేస్తూ తిను బండారాల వ్యాపారం చేస్తున్నాం. కంతులు పోను నెలకు రూ.25వేల వరకు తమకు ఆదాయం ఉంటుంది.

-లీలావతి, డ్వాక్రా మహిళ

ఆటోలో దుస్తుల వ్యాపారం...



డ్వాక్రాలో సభ్యురాలిగా ఆర్థిక ప్రగతి సాధించాం. 22 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో సభ్యులుగా చేరాం. తన భర్త తిరుపాల్‌తో కలిసి ఆటోల్లో గ్రామాలు తిరిగి బట్టల వ్యాపారం చేస్తాం. నెలకు ఖర్చులు పోను రూ.30వేలు ఆదాయం ఉంటుంది.

-వనపర్తి పెంచలమ్మ,డాక్రా మహిళ

యూరియా కొరత లేదు.. ఆందోళన వద్దు

● జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

ఖాజీపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కూనవారిపల్లె రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అనవసరంగా మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తున్నారని.. దీంతో భూసారం దెబ్బతింటుందన్నారు. ఖరీఫ్‌లో రైతులు ఎకరాకు వంద కేజీలు మూడు దపాలుగా వేసుకుంటే సరిపోతుందని.. దుక్కిలో మాత్రం పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జిల్లాలో యూరియా రైతులకు కావాల్సిన మేరకు ఉంది, ప్రతి రైతుసేవా కేంద్రానికి అందజేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ శాఖాధికారి గోవర్ధన్, మండల వ్యవసాయ శాఖాధికారి నాగార్జున, వ్యవసాయ సహాయకులు అశోక్‌కుమార్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతుల రక్తంతో రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటు : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాగుబోతుల రక్తంతో ప్రభుత్వాలను నడపాలని, రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. మద్యం కుంభకోణంలో వెలుగు చూస్తున్న విషయాల ద్వారా జగన్ పులివెందుల పరువు, కడప జిల్లా పరువు తీశాడని... ముఖ్యమంత్రి పదవికి కళంకం తెచ్చాడని ఆవేదన వెలిబుచ్చారు. తాగుడు వ్యక్తికి, కుటుంబానికి, ప్రభుత్వానికి, సమాజానికి నష్టం, ప్రతి నేరం వెనుక తాగుడు ఉంటుందన్నారు. గుజరాత్, బీహార్, మిజోరాం, నాగాలాండ్, లక్షదీవులలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తున్నాయన్నారు. మద్యపాన నిషేధాన్ని అమలుచేస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. గుజరాత్‌లో సొంత రెవెన్యూ రాబడి స్టేట్ జీఎస్టీ 48శాతం కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 11.40శాతం మాత్రమే అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు సాధ్యం కాదు, ప్రభుత్వాలకు నిధుల కొరత ఏర్పడుతుందని చెప్పడంలో వాస్తవం లేదన్నారు.

మోటారు బైకు అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి పడి ఒకరు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



శ్రీరాములు మృతదేహం

కాశినాయన జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమర్రి బ్రిడ్జి పైనుంచి సోమవారం మోటారు బైకు అదుపుతప్పి కిందపడటంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ యోగేంద్ర వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం వనపర్తి సమీపంలోని క్రిష్ణగిరి గ్రామానికి చెంది చింతపండు శ్రీరాములు(27) వంకమర్రి గ్రామానికి చెందిన రమణయ్య వద్ద ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత అవసర నిమిత్తం శ్రీరాములు, వంకమర్రి గ్రామానికి చెందిన సంద్రపల్లె వెంకటనానితో కలసి వంకమర్రి నుంచి పోరుమామిళ్లకు బయలుదేరారు. మోటారు బైకు వంకమర్రి పాత బ్రిడ్జిపైకి రాగానే అదుపుతప్పి కిందపడింది. ఈప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటనానికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి కడపకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు సందర్శించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.... ఐదుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన వారు చికిత్స పొందుతున్న దృశ్యం

బద్వేలుటౌన్, జులై 21 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం బి.కోడూ రు మండలం మేకవారిపల్లె నుంచి నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం గోవిందాయపల్లెకు వరినాట్లు వేసేందుకు ఆటోలో కూలీలు బయలుదేరి వెళుతున్నారు. నక్కలగండి సమీపం దప్పిలమ్మగుడి వద్దకు రాగానే వర్షం కారణంగా ఆటో అదుపుతప్పి ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంబాన్ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మేకవారిపల్లె గ్రామానికి చెందిన భాగ్యమ్మ, లావణ్య, సునీత, చిన్నక్కతో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

పులివెందులలో ఘర్షణ.. 8మందిపై కేసు

పులివెందుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని వైఎస్ఆర్ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చాన్‌బాష తెలిపారు. వంశీ అనే వ్యక్తి ఓ అమ్మాయి ప్రేమిస్తుండేవాడు. ఈ అమ్మాయికి వలీ అనే వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. ఈ విషయమై వంశీ, వలీ వర్గాల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. దీంతో వీరిద్దరితో పాటు మరో ఆరోగురిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారికి టీకా.. తగ్గని వాపు

● గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేసిన తల్లి



టీకా వేయడంతో చిన్నారి భుజంపై ఏర్పడ్డ గడ్డ

చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంపాడు పంచాయతీకి చెందిన శ్రీహర్షితరెడ్డి అనే 16 నెలల చిన్నారికి ఈ నెల 9న సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎం వెంకటసుబ్బమ్మ ఓ టీకా వేసింది. అయితే టీకా ఇచ్చిన మరుసటిరోజే పాప భుజంపై చిన్నపాటి గడ్డలా మారింది. దీంతో భయపడ్డ ఆ చిన్నారి తల్లి రూప ఏఎన్ఎం వద్దకు వెళ్లి గట్టిగా అడగ్గా అదేమీ కాదు మానిపోతుంది, ఆందోళన వద్దు అని చెప్పడం జరిగింది. అయితో రోజులు గడిచే కొద్దీ తగ్గకపోవడంతో ఆమె కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆశ్రయించింది. అక్కడ పరిశీలించిన వైద్యులు నయం అయ్యేందుకు సమయం పడుతుందని కొందరు, ఏమో చెప్పలేమని ఇంకొందరు రకరకాలుగా చెప్పడంతో భయపడ్డ ఆ తల్లి సోమవారం కలెక్టరు కార్యాలయంలో గ్రీవెన్‌సెల్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వినయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

తీరు మార్చుకున్న మున్సిపల్ పాలక వర్గం



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు

పులివెందుల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సార్ మా వార్డులో డ్రైనేజీ సరిగా లేదు.. తాగునీరు సక్రమంగా రావడం లేదు.. వీధిలైట్లు వెలగడం లేదు.. మాకు ప్రభుత్వ పథకం రాలేదు.... ఎలా ఏ సమస్య ఉన్నా సచివాలయంలో కంప్లైంట్ ఇవ్వండంటూ.. మొన్నటి వరకు మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు చెప్పేవారు. ఇది ఏ మారుమూల వార్డులోని ప్రజలను అడిగిన చెప్పే మాట. పథకాలకు నిధులు విడుదల, ప్రచారాలలో కనిపిస్తూ సొంత కాంట్రాక్టు పనులు చేసుకుంటూ హాయిగా గడిపేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీరు మార్చుకున్నారు. పెండింగ్ పనులకు ప్రస్తుత ప్రభుత్వం సహకరించడం లేదంటూ నిందలు వేయడం మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిన్న చిన్నపనులు చేయాలంటే నిధులు విడుదల చేయడం లేదు, టెండర్లు పిలిచినా పనులు పూర్తిచేయాలంటే నిధులు నిలబెట్టారు అంటూ గగ్గోలు మొదలుపెడుతూ వస్తున్నారు. అదే విధంగా సోమవారం కూడా మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ అధికారులు లేరు, దీంతో చిన్నచిన్న పనులు కావడం లేదు, అభివృద్ధి కుంటుపడుతోందంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపాలిటీని చిన్నచూపు చూస్తోందంటూ మున్సిపల్ కమిషనర్ ముందు నినందించారు. పనులకు అగ్రిమెంట్లు చేయాలన్నా, బిల్లులు పెట్టాలన్న ఇంజనీరింగ్ అధికారులు సంతకం చేయాల్సి ఉందన్నారు. పులివెందుల అభివృద్ధిని, ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగాన్ని నియమించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ పాలక వర్గం పులివెందుల అభివృద్ధి కోసం అధికారులను నియమించాలని నిరసన వ్యక్తం చేయడంపై పలువురు ప్రజలు, అధికారులు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లపాటు నిధులు వరదలాపారినా విద్యుత్ శాఖకు దాదాపు రూ.30కోట్ల దాకా బకాయిలు ఎందుకు పడ్డారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. దీనిని కూడా కూటమి ప్రభుత్వంపై నెపం నెట్టి... డబ్బులు ఇవ్వలేదు వీధిలైట్లు వెల గడం లేదని చెప్పడం సరికాదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు.

'శారీరక విభిన్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండండి'

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శారీరక విభి న్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండాలంటూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్దుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు ఆర్‌వీ క్రిష్ణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో కొందరు దళారులు మూడు చక్రాల స్కూటర్లు తక్షణం అందిస్తామని హామీ ఇచ్చి అర్హులైన వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ కార్యాలయం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి ప్రకటనల్లో ఎటువంటి నిజం లేదన్నారు. ప్రజలు ఇటువంటి వదంతులు నమ్మకుండా, మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ఆదేశాలు కానీ.. బడ్జెట్ కేటాయింపులు కానీ జారీ చేయలేదన్నారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన తరువాతనే దరఖాస్తుల ప్రక్రియ చేపట్టి అర్హులను గుర్తించి యూనిట్ల కేటాయింపులు పూర్తి పారద ర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయమై పూర్తి సమాచారాన్ని పత్రికల ద్వారా ప్రకటిస్తామని వివరించారు. ఈ రకమైన మోసపూరిత చర్యలకు ఈ కార్యాలయానికి, సిబ్బందికి ఎటువంటి సంబంధంలేదని తెలిపారు. ఎక్కడైనా డబ్బులు వసూలు చేస్తున్న సంఘటనలు తమ దృష్టికి వస్తే సంబంధిత వివరాలను సమగ్రంగా సేకరించి లిఖితపూర్వక ఫిర్యాదులు చేయాలన్నారు. అటువంటి ఫిర్యాదులపై చట్టనిబంధనల ప్రకా రం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయస్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలో విజేతగా పవన్‌కళ్యాణ్



పవన్‌కళ్యాణ్‌ను సత్కరిస్తున్న కృష్ణకిశోర్

కడప కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలలో కడపలోని ఓ ప్రయివేటు స్కూల్‌లో ఆర్ట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బండి పవన్‌కళ్యాణ్ వేసిన పెయింటింగ్ జాతీయస్థాయిలో ఉత్తమ పెయింటింగ్‌గా నిలిచి గోల్డ్‌మెడల్, గోల్డెన్ బ్రష్ ఆర్టిస్ట్ టైటిల్ గెలు పొందాడు. ఆ మేరకు పవన్‌కళ్యాణ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంబంధిత అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌వీ కృష్ణకిశోర్ సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురష్కరించుకుని గత మే 7న మన దేశం క్రియేటివ్ ఆర్ట్ హార్ట్ అకాడమీ వారు ఏర్పాటు చేసిన పెయింటింగ్ పోటీలలో పవన్‌కళ్యాణ్ విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మైభారత్ (నెహ్రూ కేంద్రం) సిబ్బంది ప్రేమ్, మదర్‌థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవానికి దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం



బ్రహ్మంగారిమఠం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలో ఆగస్టు 6వ తేదీ గోవిందమాంబ సమేత వీరబ్ర హ్మేంద్రస్వాముల మాస కల్యాణ మహో త్సవానికి సంబంధించి దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు మఠం దేవ స్థాన ఫిట్ పర్సన్ శంకర బాలాజీ తెలిపారు. కల్యాణ మహోత్సవానికి మంత్రిని హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం మంత్రి కల్యాణమహోత్సవ ఆహ్వానపత్రికను ప్రదర్శించారు.

రసవత్తరంగా మల్టీడే క్రికెట్ పోటీలు



కశ్యప్‌రెడ్డి, గైబు, దినేష్

కడప స్పోర్ట్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కడప జట్టుపై నెల్లూరు జట్టు 11 పరుగుల ఆధిక్యత సాధించగా, మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు 56 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా.....

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలిరోజు టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో కేవలం 78 పరుగులకే కుప్పకూలింది. బౌలింగ్ విభాగంలో కడప జట్టు బౌలర్లు కశ్యప్ రెడ్డి, గైబు చెరీ 5 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 38.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో లోకేష్ 55 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 62 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టి 73 పరుగులు చేసింది. దీంతో ఇప్పటివరకూ నెల్లూరు జట్టుకు 11 పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు చేపట్టి.. తన మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులకే చేతులెత్తేసింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ దినేష్ ఏకంగా 6 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అక్తర్ 81 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టుకు 56 పరుగుల ఆధిక్యత లభించింది.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న రామకృష్ణయ్య

నందలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కుప్పాల రామకృష్ణయ్య సోమవారం కంప్యూటర్ వితరణగా అందజేశార. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అందరికీ అవసరమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రఘుప్రసాద్, నిత్యపూజయ్య, సాహెబ్ జాన్, సుభాయతుల్లా, ఆయేషా పర్విన్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్

సుండుపల్లె, జూలై21(ఆంధ్రజ్యోతి): స్పందనలో ఫిర్యాదుపై విచారణ నిర్వహించినట్లు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అక్కంపల్లి జగనన్న కాలనీలో అనుమతులు లేకుండా మసీదు కడుతున్నారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, అక్కంపల్లి గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిర్మాణాలను పరిశీలించారు. ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన ఇంటి స్థలాల్లో మసీదుల నిర్మాణానికి అనుమతి లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మసీదు కాదు ఇంటి నిర్మాణానికి కడుతున్నామని నిర్మాణదారులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే రెండు గృహాలు కలిపి కాకుండా ప్రభుత్వ ఆదేశల మేరకు నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సబయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలపై జేసీకి ఫిర్యాదు



జేసీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేత శివప్రసాద్

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భూకబ్జాలపై కడప కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు భూకబ్జాలపై రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్ట శివప్రసాద్ ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... శాఖరాజుపల్లె రెవెన్యూ పొలం సర్వేనంబరు 259లో ఎస్‌టీవీడీ సభ హైస్కూల్‌కు ఆరెకరాలు పైబడి డీకేటీ స్థలాన్ని అధికారులు గతంలో మంజూరు చేశారని, ఆ స్థలాన్ని స్కూల్ కోసం వినియోగించకుండా అక్కడే సమాధులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. మరి కొంత స్థలాన్ని గృహాల నిర్మాణాలకు వినియోగించారని పేర్కొన్నారు. సమాదులు పూర్తిగా తొలగించి విద్యార్థులకు విముక్తి కలిగించాలని జేసీకి ఫిర్యాదు చేశారు. సిద్దవటం మండలంలో ఎంతోమంది పేదలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని, వారికి మంజూరు చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



ఒంటెల సిద్దయ్యనగర్‌లో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ముక్కా

రైల్వేకోడూరు రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కోడూరు నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఒంటెల సిద్ధయ్య కాంప్లెక్స్ వద్ద రూ.26 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజ్, సీసీ రోడ్డును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం లక్ష్మీనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోడూరు మండలంలో రూ.60 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నామన్నారు. త్వరలో కోడూరు పట్టణంలోని ప్రతి వీధిలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మైసూరివారిపల్లి సర్పంచ్ సంయుక్త, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, టీడీపీ మైనారిటీ సీనియర్ నాయకులు పఠాన్ మౌలా, షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి మండిపల్లిపై వ్యక్తిగత దూషణలు చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్/సంబేపల్లె/గాలివీడు,జూలై21(ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై మాజీ ఎమ్మె ల్యే రమేశ్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు చేస్తే సహించబోమన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కూటమి ప్ర భుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సహకరించి ప్రజాగ్రహానికి గురికాకుండా నడుచుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, మాజీ సర్పంచులు మేఘనాద్‌రెడ్డి, బసయ్య, జిలానీబాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు: గాజుల ఖాదర్‌బాషా

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యేలు రమేశ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి వ్యక్తిగతంగా ఆట్లాడడం మంచిది కాదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని 103వ బూత్‌లో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు అమావాస్య రెడ్డెయ్య పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లిపై మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి అసత్య ఆరోపణలు సరికాదని జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు.

'ఖబడ్దార్.. రమేశ్‌రెడ్డీ'

'మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డీ ఖబడ్దార్' అని మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాసరాజు, ఫరీద్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటశివారెడ్డి విలేకరుల సమావేశంలో హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి 41 నోటీసు

చిన్నమండెం, జూలై21(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో 41 నోటీస్ ఇచ్చారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేశాడంటూ నమోదైన కేసును చిన్నమండెంకు బదిలీ చేయగా మాజీ ఎమ్మెల్యేను మదనపల్లె నుంచి సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌కు తరలించి 41 నోటీసు ఇచ్చి పంపించారు.

యాప్‌ల భారం తగ్గించాలని అంగన్వాడీల నిరసన



సీడీపీవో నిర్మల జ్యోతికి వినతిపత్రం అందిస్తున్న పెనగలూరు అంగన్వాడీ కార్యకర్తలు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు యాప్‌ల భారం తగ్గించాలంటూ సోమవారం నిరసన తెలుపుతూ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో నిర్మల జ్యోతికి వినతిపత్రం ఇచ్చినట్లు అంగన్వాడీ మండల అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కార్యకర్తలు అన్నపూర్ణమ్మ, అనిత, మహాలక్ష్మిలు తెలిపారు. సోమవారం మండలంలోని గర్భవతులు, బాలింతలతో కలిసి చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో యాప్‌ల భారం తగ్గించాలని ఈ సందర్భంగా కోరారు. గర్భవతులు, బాలింతలు నెలకు నాలుగు సార్లు కేంద్రాలకు రావాలంటే విముకత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వారు వచ్చిన సమయంలో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి ఉండలేక తమను నిష్ఠూరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. యాప్‌ల విధానంను తొలగించి మాన్యువల్ విధానంలో తమకు విధులు అప్పజెప్పితే పనిభారం సులభంగా ఉంటుందని ఈ సందర్భంగా కోరారు.

రేపు ఐటీఐలో అడ్మిషన్ల కౌన్సెలింగ్

రాజంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్ కౌన్సిలింగ్ ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు రాజంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు దరఖాస్తు చేసుకున్న, సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ అయిన వారి పేర్లను మాత్రమే మెరిట్‌లిస్టులో ఉంచుతామని తెలిపారు. 23 నుంచి 25వ తేదీ వరకు ప్రభుత్వ ఐటీఐల్లోను, 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐల్లోను అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్నారో అక్కడే కౌన్సిలింగ్‌కి హాజరు కావాలన్నారు. పదో తరగతి, ఫొటో, మెయిల్ ఐడీ, ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు. సాంకేతిక విద్యలో పరిణతి సాధించి త్వరితగతిన ఉద్యోగాల్లో స్థిరపడాలని ప్రిన్సిపల్ సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ములకలచెరువు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరసింహుడు హెచ్చరించారు. ములకలచెరువు, పెద్దపాళ్యంలో సోమవారం వాహనదారులు, ద్విచక్ర వా హన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

వైసీపీ అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లిస్తా

● మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జూలై21(ఆంధ్రజ్యోతి): 'నాపై కక్షగట్టి కేసులు బనాయించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే వడ్డీతో సహా చెల్లిస్తా' అని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, ఎప్పుడైనా ఎక్కడికైనా వస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డెయ్య తదతరులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య శిబిరం

రాజంపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈనెల 25న రాజంపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కడప - తిరుపతి బైపాస్‌రోడ్డులో ఉన్న అరవింద్ నేత్రాలయం డాక్టర్ అరవింద్ సహకారంతో నిర్వహిస్తున్న జర్నలిస్టుల ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు వెంకటరెడ్డి, రాజంపేట ప్రెస్ అధ్యక్షులు భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత్రికేయులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కంటిచూపు తక్కువ ఉన్నవారికి కంటి అద్దాలను అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీహరి, ఉదయగిరి కళ్యాణ్, నాగేంద్రప్రసాద్, నరసింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా బీజేపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీనివాసులరెడ్డి



గాలివీడు, జూలై21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బీజేపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీనివాసుల రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. తాను ఎగ్జిక్యూటివ్ మెంబర్ అయ్యేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణ పరిధిలోని 33/11కేవీ ఫీడర్‌కి సంబంధించిన ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్ల మధ్యలో ఉన్న చెట్లు తొలగింపు తదితర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సాయినగర్, ఎర్రబల్లె, మన్నూరు, ములక్కాయలపల్లె పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మైండ్ మేనేజ్‌మెంట్ ఫర్ బెటర్ ఫ్యూచర్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న ఇంజనీరింగ్ విద్యార్థులు

రాజంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు మైండ్ మేనేజ్‌మెంట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ మఠం స్వామి బోధమయానందాజీ మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మనస్సు నిబద్ధతతో నడిపితే జీవిత విజయం సాధ్యమవుతుందన్నారు. జ్ఞానం. నియంత్రణ, ధ్యానం జీవితాన్ని గెలవడానికి మార్గం చూపుతాయని స్పష్టంగా వివరించారు. విద్యార్థుల జీవిత పరిపక్వతకు, లక్ష్యసాధనకు మైండ్ మేనేజ్‌మెంట్ ఎంత అవసరమో ఆకర్షణీయంగా వివరించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఆధారిత, ఆధ్యాత్మికతతో కూడి వ్యక్తిత్వ వికాస సదస్సులు విద్యార్థుల జీవితాల్లో కీలకంగా మారతాయన్నారు. ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అద్భుతమ ఐన భవిష్యత్తును కలిగి ఉండాలంటే ముందు మనస్సును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మనసును ఎవరైతే సమర్థంగా నిర్వహిస్తారో వారు జీవితంలో విజేతలవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రైల్వేకోడూరు, జూలై21(ఆంధ్రజ్యోతి): మామిడి లారీ ప్రమాద బాధితులకు వెంటనే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత కుటుంబాలతో నిరసన తెలిపారు. మృతి చెందిన కుటుంబానికి రూ.20 లక్షలు, తీవ్రంగా గాయపడిన కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగి వారం రోజులు అయినా ప్రభుత్వం స్పందించపోవడం ఏమిటని ప్రశ్నించారు. గిరిజన కుటుంబాలపై రాష్ట్రం ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మా



అధికారులు లేక వెలవెలబోతున్న ప్రజావాణి కార్యక్రమం

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికారులు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో అధ్యక్షతన హౌసింగ్ కార్పొరేషన్, వెలుగు కార్యాలయాల సిబ్బంది తప్ప మిగతా శాఖల అధికారులు నెలల తరబడి ప్రజావాణి కార్యక్రమంలో కనిపించకపోవడం విచారకరమని పలువురు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్ ఏఈ నెల రోజుల నుంచి కార్యాలయానికి రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.కాగా సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రజావాణిలో పాల్గొనడం గమనార్హం. ఈ విషయంపై ఎంపీడీవో విజయరావును వివరణ కోరగా ఏవో అనంతంపల్లి సమావేశానికి వెళ్లారన్నారు.

అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

రాజంపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఫేస్ యాప్ రద్దు చేయాలని సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే ఉద్దేశ్యంతో ఫేస్ యాప్‌ను తీసుకువచ్చారు. ఓటీపీ, ఈకేవైసీ, ఫొటో క్యాంపర్ చేసి సరుకులు ఇవ్వాలన్న నిబంధన తొలగించాలన్నారు. అంగన్వాడీలకు ఇచ్చిన మొబైల్‌ఫోన్లు సరిగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తే మరుసటి నెలలో సరుకులు వస్తున్నాయని తెలిపారు. కావున ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి ఉచిత వైఫై అందించాలని డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



హసనాపురం గ్రామ సచివాలయంలో సెంట్రల్ శానిటేషన్ టీం, తదితరులు

రామాపురం, జూలై21(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సెంట్రల్ శానిటేషన్ టీం మెంబర్ హేమంత్ సూచించారు. సోమవారం ఆయన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025లో భాగంగా రామాపురం మండలం హసనాపురం గ్రామ పంచాయతీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉర్దూ ఆరోగ్య కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను తొలగించి ఇంటి పరిష్కారాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, డ్రైనేజీ కాలువలను పరిశీలించారు.

'చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'



జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాసులు

రాయచోటి(కలెక్టరేట్), జూలై21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్నికుంట్ల రోడ్డు సమీపంలో ఉన్న ఇనాయత్ ఖాన్ చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 509లో కొంత మందికి మిలిటరీ పట్టా ఉందని దాదాపు రెండు ఎకరాలు తయారు చేసి లేఅవుట్లు ఏర్పాటు వేస్తున్నారన్నారు. చెరువును కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయకుంటే పోరాటాలకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్ర, సీపీఐ పట్టణ నాయకులు రాంమోహన్ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట ఎంపీపీగా తిరిగి బాధ్యతలు చేపట్టిన లక్ష్మీదేవి



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

ఒంటిమిట్ట జూలై 21 (ఆంధ్రజ్యోతి):ఒంటిమిట్ట ఎంపీపీగా అక్కి లక్ష్మీదేవి బాధ్యతలు చేపట్టారు. అనారోగ్య కారణంగా ఈ యేడాది ఏప్రిల్ 23వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు సెలవు పెట్టారు. సెలవు కాలం పూర్తి కావడంతో సోమవారం సాయంత్రం ఆమె తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సుజాతమ్మ, ఈవోపీఆర్డీ ప్రసాద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

ప్రజలు ఇచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజా దర్బారులో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై21(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొంత మంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు.

పీలేరు సొగసు చూడతరమా..!

'ప్రముఖ విద్యా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణం ఒక్క రాత్రి కురిసిన వర్షానికి ఉక్కిరిబిక్కిరైంది. జనం కంటి మీద కునుకు లేకుండా పోయింది. పట్టణంలోని పలు ప్రధాన వీధులు మురుగు కాలువలను తలపించాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్ స్టేషన్ చెరువును తలపించింది. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రధాన రహదారి నుంచి ఎస్వీ మహల్, సత్యప్రియ లాడ్జి, గుప్త హాస్పిటల్, ఎస్వీ డీలక్స్ మార్గం రూపురేఖలు మురుగునీటి ధాటికి పూర్తిగా మారిపోయాయి. కట్టుకాలువ వీధి, గోరీల తోపు, రాజీవ్‌నగర్ కాలనీ రహదారిపై మురుగునీటి ప్రవాహంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ శివారులోని మోడల్ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో జనం కష్టాలపాలయ్యారు.



పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

- రోడ్లపై మురుగు ప్రవాహం
- చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్ స్టేషన్
- వీధుల్లో మేట వేసిన ఇసుక
- మోడల్ కాలనీలో ఇళ్లలోకి.. వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు

పీలేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంలో నాలుగు చినుకులు పడినా పట్టణమంతా మురుగుమయమవుతోంది. మురుగు కాలువల ఆక్రమణలు, ముందు చూపులేకుండా సీసీ రోడ్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం వల్లే సమస్య జటిలంగా మారుతోంది. గురువారం రాత్రి 66 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పట్టణంలోని మురుగు కాలువలు, వీధులు ఏకమై పలు ప్రాంతాల్లో ఇసుక మేట వేసింది.

చెరువులా ఆర్టీసీ సముదాయం..

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటే ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం చెరువును తలపిస్తుండగా, దుకాణాల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ నల్లగుట్ట,శ్రీకృష్ణదేవరాయనగర్, క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల నుంచి వర్షపునీరు, మురుగు బస్ స్టేషన్‌లోకి రాకుండా నివారణ చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమౌతున్నారు.

రోడ్లపై ఇసుక మేటలు...

పట్టణంలో పలు చోట్ల ఇసుక మేట వేయడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని తిమ్మారెడ్డి క్రాస్, పోలీస్ క్వార్టర్స్, కడప రోడ్, కోటపల్లె మార్గం, రైల్వే అండర్ బ్రిడ్జి, యల్లమంద క్రాస్, ట్రెండ్స్ తదితర ప్రాంతాలలో రహదారిపై ఇసుక మేటలతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కాలువలను తలపిస్తున్న వీధులు..

పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ, గోరీల తోపు మార్గం పూర్తిగా మురుగు నీటితో నిండిపోయాయి. దీంతో పాదచారులు, వాహన చోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటపల్లె మార్గంలో మురుగు కాలువలు, వీధులు ఒక్కటయ్యాయి. ఎక్కడికక్కడే మురుగు నీరు రోడ్లపై నిలిచిపోయింది. చిత్తూరు, మదనపల్లె మార్గంలో, ఆర్‌వోబీ పనులు జరుగుతున్న ప్రాంతాలు వర్షంధాటికి ప్రమాదకరంగా మారాయి.

అధికారుల నిర్లక్ష్యం...

అధికారులు కార్యాలయాలకే పరిమితమై, సమస్యలపై దృష్టి సారించకపోవడమే ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెట్టుకోవడం వల్లే సమస్య జటిలంగా మారిందని అంటున్నారు.





కోటపల్లె, యల్లమంద క్రాస్ వద్ద రోడ్డుపై మురుగు

ప్లాస్టిక్ వ్యర్థాలు.. ఆక్రమణలే కారణం



ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడేయడం, మురుగు కాలువలు ఆక్రమణల బారిన పడడం తోనే మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. పీలేరు గ్రామ పంచాయతీ అధికారులతో పాటు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– గోపీనాథరెడ్డి, రిటైర్డ్ ఈఈ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్



మురుగును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రైతుల సంక్షేమం కోసమే 'పీఎం ప్రణామ్'

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అగ్రికల్చర్ జేడీలు

రాయచోటి(కలెక్టరేట్), జూలై21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం ప్రణామ్ స్కీమ్ ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పచ్చిరొట్ట జీవన ఎరువుల గోడ పత్రికను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బయో ఎరువులు, సేంద్రియ ఎరువులతో కలిపి ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ స్కీం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ పథకం ద్వారా కృత్రిమ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశమన్నారు. దీంతో ఆరోగ్యమైన నేలతో పాటు భూసారం, పోషకాల లభ్యత పెరిగి నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని కలెక్టర్ తెలిపారు.

పారిశుధ్యం తీరుపై కేంద్ర బృందం అసహనం



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణనెల్లూరు గ్రామ పంచాయతీలో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. రెండు అంగన్వాడీ కేంద్రాలు, ఒక ఎలిమెంటరీ పాఠశాల, హెల్త్ సెంటర్, చెత్త సేకరణ కేంద్రాలను తనిఖీ చేసింది. కొన్ని కుటుంబాలు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా పరిశీలించి. అన్నిచోట్ల పారిశుధ్యం సరిగా లేదని, దానిపై ప్రజలకు సరైన అవగాహన కల్పించలేదని ఈ సందర్భంగా బృంద సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతిరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవని స్పష్టంగా తెలుస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు మినహా మిగిలినవారు లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే టైపిస్టు అనిత కేంద్ర బృందానికి సహకరించారు. ఈ విషయంపైన కూడా సంబంధిత అధికారులు లేకుండా శాఖలకు సంబంధం లేని వారు సమాధానం చెప్పడంపై కూడా వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ శానిటేషన్ టీమ్ సభ్యులు ఎం.సుబ్బరాయుడు, స్వచ్ఛభారత్ గ్రామీణ కన్సల్టెంట్ బి.మద్దిలేటి, గ్రామ సర్పంచ్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈశ్వరప్ప

తంబళ్లపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): తంబళపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు మల్లయ్యకొండకు వచ్చి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప స్వామి వారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. కొండపైన గౌరమ్మ అమ్మవారికి, ఏనుగు మల్లమ్మకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మునిరాజ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఉజ్జయిని మహంకాళికి ఆషాఢం సారె



ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెస్తపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి ఉజ్జయిని మహంకాళికి ఆదివారం రాత్రి సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆషాఢమాస సారె కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు స్థానిక అనంతపురం గంగమ్మ దేవాలయం నుంచి మంగళవాయిద్యాలతో మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు, పసుపు కొమ్ములు, తాళిబొట్టు, దారం, వడిబియ్యం, పూలు, పండ్లతో పాటు మంగళకరమైన వస్తువులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజన సహ ప్రముఖ జయరామిరెడ్డి, బాలవికాస ఉపాధ్యాయ జిల్లా సహ కన్వీనర్ వెంకటరమణయ్య, రాజంపేట సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని చాముండేశ్వరిపేటకు చెందిన నారపురెడ్డి రామచంద్రారెడ్డి(60) సోమవారం రాత్రి బాకరాపేట సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కడప చెన్నై జాతీయ రహదారిని దాటుతుండగా తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోయింది. ఈ విషయంపై స్థానికులు హైవే పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించడంతో కడప నగర సమీపంలో బస్సును అదుపులోకి తీసుకున్నారు. మృతిచెందిన వ్యక్తికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు మృతుని బంధువులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు సంఘటనా స్థలాన్ని సందఱిదదంచారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

తాగునీరు సరఫరా చేయాలి

- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో క్యాన్‌కు రూ. 20 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందంటూ మండలంలోని మాధవరం-1, పార్వతిపురం, వెంకటేశ్వరపురం, రామకృష్ణపురం గ్రామాలకు చెందిన మహిళలు సోమవారం మండల కేంద్రంలో ఖాళీ బిందెలతో వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించనిపక్షంలో గ్రామ సచివాలయాన్ని ముట్టడిస్తామని, ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్‌ను వివరణ కోరగా మాధవరం గ్రామానికి వెళ్లే పైపులైను సిద్దవటం బ్రిడ్జి సమీపంలో దెబ్బతిందని, దీనికిమరమ్మతులు చేస్తున్నామని మంగళవారం నుంచి క్రమం తప్పకుండా తాగునీరు అందిస్తామని తెలిపారు.

చదువులబాబుకు జీవన సాఫల్య పురస్కారం



డీకే చదువులబాబును సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువులబాబుకు జీవన సాఫల్య జాతీయ సాహిత్య సేవా పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం హిందూపురంలోని సెవన్ స్టార్ ఫంక్షన్ హాలులో భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీ సత్యసాయిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో చదువుల బాబుకు జాతీయ సాహిత్య సేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా, అఖిలభారత టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలికి సన్మానం



నాగూర్‌వలిని సన్మానిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలిని కూటమి నాయకులు సోమవారం కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో దుశ్శాలువలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీ కో- కన్వీనర్ గంగారపు రామదాస్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని, డిపోలోని అన్ని యూనియన్ల నాయకులను కలుపుకుని పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ డిపోల్లో సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకారం అందించిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, టీడీపీనాయకులు సీడ్ మల్లికార్జున నాయుడు, యాలగిరి దొరస్వామినాయుడు, గిరి, బ్యాంకు రమణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ నేత అబ్బవరం రామాంజులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపుతో పాటు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 9వ రోజు ఒంటికాలి మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, శంకరయ్య, అక్బర్, చెన్నయ్య, రాంబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీతం పెంపుతో పాటు సామాజిక భద్రతకై సంక్షేమ పథకాల అమలు, వయో పరిమితి 62 ఏళ్ల పెంపు, విధి నిర్వహణలో చనిపోయిన వర్కర్స్‌కు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే అంశం మీద పరిశీలిస్తామనడం సరైంది కాదన్నారు. అన్ని డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె విరమించబోమని తెలిపారు. మున్సిపల్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, తిరుపాల్, మంగమ్మ, రెడ్డిప్రసాద్, లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు, ఆటో ఢీ : ఆరుగురు విద్యార్థులకు గాయాలు



సంఘటనా స్థలంలో బస్సు, ఆటో



108లో తరలుతున్న విద్యార్థులు



పరామర్శిస్తున్న సీడు మల్లికార్జున నాయుడు

కురబలకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సు, ఆటో ఢీకొనడంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అంగళ్లు సమీపంలోని ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన బస్సు సోమవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు తీసుకెళుతుండగా, ముదివేడు క్రాస్ వద్దనున్న మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళుతున్న ఆటో ఇళ్ళకు బయలుదేరి నడింపల్లె గ్రామ సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు 108 వాహనంలో విద్యార్థులను మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపక్క నున్న పొలంలో బోరు వేస్తుండడంతో వెలువడిన ధూళి కారణంగా దారి కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● టీడీపీ నేత మల్లికార్జునాయుడు పరామర్శ

మదనపల్లె : ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులను తంబళపల్లె నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు పరామర్శించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరుకుని గాయపడిన శివమణి, పల్లవి, లహరి, యశ్వంత్, మంజుల, కేశవ, అమృతను పరామర్శించారు. కురబలకోట మండల టీడీపీ అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, నేతలు డేరంగుల చంద్ర, సోమశేఖర్, రాజారెడ్డి, శివలింగారెడ్డి ఆయనకు సహకరించారు. దీంతో ఆయనను స్థానిక నాయకులు ప్రజలు తదితరులు ప్రశంసించారు

అతివేగం.. నిర్లక్ష్యం..

● నెత్తురోడుతున్న రహదారులు.. ● దివ్యాంగులుగా మారుతున్న యువకులు ● రోడ్డున పడుతున్న కుటుంబాలు



చెన్నామర్రి మిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

కురబలకోట, జులై 21 (ఆంధ్రజ్యోతి): వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, కునుకు పాటు, మద్యం సేవించడం, అతి వేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు పరిపాటిగా మారాయి. దీంతో పెద్ద దిక్కు కోల్పోయి పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఎంతో మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం జారీ చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారుతోంది. ముంబై-చెన్నై, కడప- మదనపల్లె మార్గాల్లో ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎంతో మంది అంగ వైకల్యాన్ని పొందారు. ఈ ఏడాది జనవరి నుంచి మండలంలో జరిగిన ప్రమాదాల వివరాలిలా..

● ఈ ఏడాది జనవరి 2న ముదివేడు టోల్‌ప్లాజా వద్ద ఇన్నోవా కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో చేనేత నగర్‌కు చెందిన కార్మికుడు గంగుల్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.

● జనవరి 16న అంగళ్లు సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద ప్రైవేట్ బస్సు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడడంతో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు.

● 22న కురబలకోట ఫ్లై ఓవర్ వద్ద ద్విచక్ర వాహనం బోల్తాపడి రాయచోటికి చెందిన ఫైజాన్(22), ఫహాద్ తీవ్రంగా గాయపడ్డారు.

● ఫిబ్రవరి 4న మండలంలోని దాదాంవారిపల్లెకు చెందిన ఈశ్వరప్ప, రాజేశ్వరమ్మ కారులో బెంగళూరుకు వెళ్ళి తిరిగి వస్తుండగా టైరు పేలడంతో వాహనం అదుపుతప్పి గాయపడ్డారు.

● 14న మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ధర్మపురికి చెందిన సతీష్ కుమార్ గాయపడ్డాడు.

● 21న అంగళ్లు బైపాస్‌రోడ్డులో టెంపో, లారీ ఢీకొనడంతో ములకలచెరువు మండలం రాయపు వారిపల్లెకు చెందిన డ్రైవర్ మనోహర్(25) అక్కడి కక్కడే మృతి చెందాడు.

● మార్చి 18న కడప-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని మధ్యాహ్నంవారిపల్లె సమీపంలో కారు, బస్సు ఢీకొనడంతో కడప పట్టణానికి చెందిన జహీర్(27) అక్కడిక్కడే మృతి చెందాడు.

● 20న ముదివేడు క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

● ఏప్రిల్ 2న రిషివ్యాలీ క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా మండ్యంవారిపల్లెకు చెందిన వెంకటరమణ తీవ్రంగా గాయపడాడు.

● మే 7న అంగళ్లు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇంజనీరింగ్ విద్యార్థి కింద పడిపోయాడు. అదే సమయంలో అతనిపై ట్రాక్టర్ వెళ్లడంతో పెద్ద మండ్యం మండలంలోని కలిచెర్ల సమీపంలో శెట్టివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు వెంకటరమణ (22)మృతి చెందాడు. సీటీఎం రోడ్డులో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కనసానివారిపల్లె కాలనీకి చెందిన విష్ణువర్ధన్ (24) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అతని స్నేహితులు వెంకటేష్‌బాబు, బాబా ఫకృద్దీన్ గాయపడ్డారు.

● 9న దొమ్మన్నబావి సమీపంలో టమోటా లారీ, కారు ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు.

● 21న మండలంలోని ముదివేడు క్రాస్ వద్ద ఐషర్ వాహనం, కారును ఢీకొనడంతో బస్సు కోసం రోడ్డు పక్కన వేచియున్న ములకలచెరువు మండలం చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారి ఎల్లెకు చెందిన వెంకట్రమణ గాయపడ్డారు.

● మే 30న బెంగళూరు నుంచి రాయచోటికి వెళుతుండగా మండలంలోని జంగావారిపల్లె సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో రాయచోటికి చెందిన ఖాదర్ కుమారుడు నవాజ్(24) అక్కడిక్కడే మృతి చెందగా, మహమ్మద్ అలీఖాన్(24), ముజిమిల్(24), ఖాదర్‌ఖాన్(24), సుహేల్(24) గాయపడ్డారు.

● జూన్ 30న మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద టెంపో ట్రావెల్, కంటైనర్ ఢీకొనడంతో కర్ణాటక కు చెందిన ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా, 10మంది తీవ్రంగా గాయపడ్డారు.



ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

ఎస్‌హెచ్‌జీ రుణాలతో సాధికారిత

● ఆర్థిక ప్రగతి సాధిస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు



పోరుమామిళ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భర్త సంపాదనే కాకుండా భర్త కష్టంలో చేదోడు వాదోడుగా ఉంటూ.. ఆ మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు పొందుతూ సాధికారత సాధిస్తున్నారు పోరుమామిళ్ల మండలంలో 1286 స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ బాధ్యతలలో తమ వంతు భాగస్వామ్యులవుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. డ్వాక్రా రుణాలు పొందిన వారు బేకరీలు, బట్టల షాపులు, రెడిమేడ్ షాపులు, చిన్న చిన్న ఫ్యాన్సీస్టోర్‌లు నిర్వహిస్తూ ప్రగతిని సాధిస్తున్నారు. అంతేకాకుండా 18 నెలల క్రితం పోరుమామిళ్లలో వెలుగు మహిళామార్ట్‌ను కూడా ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వం రూ.10లక్షలు పెట్టుబడులు పెట్టగా, 10వేల మంది సంఘ సభ్యులు దాదాపు రూ.15లక్షలు పెట్టుబడి పెట్టారు. మొత్తం రూ.25లక్షల వ్యయంతో ఈ మార్ట్ అభివృద్ధిపథంలో పయనిస్తోంది. ఇందులో వచ్చే లాభాలను అందరికీ భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకుంటూ సంబంధిత అధికారులు ముందుకు సాగుతున్నారు. అంతేకాక ఇదే మహిళా మార్ట్‌లో నలుగురు డ్వాక్రా సంఘాల సభ్యులు పనిచేస్తున్నారు. ఈ నలుగురికి కలిపి నెలకు రూ.28వేలు జీతాన్ని కూడా పొందుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు పొంది ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ప్రస్తుతం మైక్రోక్రెడిట్ ప్లాన్ అమలులో ఉండడంతో 30 గ్రూపులకు చెందిన సభ్యులకు ప్రస్తుతం ఈ మూడు నెలలకు దాదాపు రూ.కోటి 50 లక్షల రుణాలు వచ్చాయి. మిగలిన గ్రూపులకు కూడా రుణాలు అందిస్తే మరింత మంది మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తారని... ఆ దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



పోరుమామిళ్లలో వెలుగు మహిళా మార్ట్

తినుబండారాల వ్యాపారం చేస్తున్నాం..



డ్వాక్రాలో చేరిన తరువాత తమ ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. 14 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో చేరా. ఐదువేల నుంచి రూ.2లక్షల వరకు రుణాలు పొందే స్థాయికి చేరా. ప్రధానమంత్రి స్కీం ద్వారా తినుబండారాల తయారీకి రూ.10లక్షల విలువైన మిషన్ కూడా వచ్చింది. తన భర్తతో కలిసి మిషన్ రన్ చేస్తూ తిను బండారాల వ్యాపారం చేస్తున్నాం. కంతులు పోను నెలకు రూ.25వేల వరకు తమకు ఆదాయం ఉంటుంది.

-లీలావతి, డ్వాక్రా మహిళ

ఆటోలో దుస్తుల వ్యాపారం...



డ్వాక్రాలో సభ్యురాలిగా ఆర్థిక ప్రగతి సాధించాం. 22 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో సభ్యులుగా చేరాం. తన భర్త తిరుపాల్‌తో కలిసి ఆటోల్లో గ్రామాలు తిరిగి బట్టల వ్యాపారం చేస్తాం. నెలకు ఖర్చులు పోను రూ.30వేలు ఆదాయం ఉంటుంది.

-వనపర్తి పెంచలమ్మ,డాక్రా మహిళ

యూరియా కొరత లేదు.. ఆందోళన వద్దు

● జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

ఖాజీపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కూనవారిపల్లె రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అనవసరంగా మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తున్నారని.. దీంతో భూసారం దెబ్బతింటుందన్నారు. ఖరీఫ్‌లో రైతులు ఎకరాకు వంద కేజీలు మూడు దఫాలుగా వేసుకుంటే సరిపోతుందని.. దుక్కిలో మాత్రం పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జిల్లాలో యూరియా రైతులకు కావాల్సిన మేరకు ఉంది, ప్రతి రైతుసేవా కేంద్రానికి అందజేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ శాఖాధికారి గోవర్ధన్, మండల వ్యవసాయ శాఖాధికారి నాగార్జున, వ్యవసాయ సహాయకులు అశోక్‌కుమార్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతుల రక్తంతో రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటు : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాగుబోతుల రక్తంతో ప్రభుత్వాలను నడపాలని, రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. మద్యం కుంభకోణంలో వెలుగు చూస్తున్న విషయాల ద్వారా జగన్ పులివెందుల పరువు, కడప జిల్లా పరువు తీశాడని... ముఖ్యమంత్రి పదవికి కళంకం తెచ్చాడని ఆవేదన వెలిబుచ్చారు. తాగుడు వ్యక్తికి, కుటుంబానికి, ప్రభుత్వానికి, సమాజానికి నష్టం, ప్రతి నేరం వెనుక తాగుడు ఉంటుందన్నారు. గుజరాత్, బీహార్, మిజోరాం, నాగాలాండ్, లక్షదీవులలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తున్నాయన్నారు. మద్యపాన నిషేధాన్ని అమలుచేస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. గుజరాత్‌లో సొంత రెవెన్యూ రాబడి స్టేట్ జీఎస్టీ 48శాతం కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 11.40శాతం మాత్రమే అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు సాధ్యం కాదు, ప్రభుత్వాలకు నిధుల కొరత ఏర్పడుతుందని చెప్పడంలో వాస్తవం లేదన్నారు.

మోటారు బైకు అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి పడి ఒకరు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



శ్రీరాములు మృతదేహం

కాశినాయన జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమర్రి బ్రిడ్జి పైనుంచి సోమవారం మోటారు బైకు అదుపుతప్పి కిందపడటంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ యోగేంద్ర వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం వనపర్తి సమీపంలోని క్రిష్ణగిరి గ్రామానికి చెంది చింతపండు శ్రీరాములు(27) వంకమర్రి గ్రామానికి చెందిన రమణయ్య వద్ద ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత అవసర నిమిత్తం శ్రీరాములు, వంకమర్రి గ్రామానికి చెందిన సంద్రపల్లె వెంకటనానితో కలసి వంకమర్రి నుంచి పోరుమామిళ్లకు బయలుదేరారు. మోటారు బైకు వంకమర్రి పాత బ్రిడ్జిపైకి రాగానే అదుపుతప్పి కిందపడింది. ఈప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటనానికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి కడపకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు సందర్శించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.... ఐదుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన వారు చికిత్స పొందుతున్న దృశ్యం

బద్వేలుటౌన్, జులై 21 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం బి.కోడూ రు మండలం మేకవారిపల్లె నుంచి నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం గోవిందాయపల్లెకు వరినాట్లు వేసేందుకు ఆటోలో కూలీలు బయలుదేరి వెళుతున్నారు. నక్కలగండి సమీపం దప్పిలమ్మగుడి వద్దకు రాగానే వర్షం కారణంగా ఆటో అదుపుతప్పి ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంబాన్ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మేకవారిపల్లె గ్రామానికి చెందిన భాగ్యమ్మ, లావణ్య, సునీత, చిన్నక్కతో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

పులివెందులలో ఘర్షణ.. 8మందిపై కేసు

పులివెందుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని వైఎస్ఆర్ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చాన్‌బాష తెలిపారు. వంశీ అనే వ్యక్తి ఓ అమ్మాయి ప్రేమిస్తుండేవాడు. ఈ అమ్మాయికి వలీ అనే వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. ఈ విషయమై వంశీ, వలీ వర్గాల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. దీంతో వీరిద్దరితో పాటు మరో ఆరేగురిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తీరు మార్చుకున్న మున్సిపల్ పాలక వర్గం



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు

పులివెందుల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సార్ మా వార్డులో డ్రైనేజీ సరిగా లేదు.. తాగునీరు సక్రమంగా రావడం లేదు.. వీధిలైట్లు వెలగడం లేదు.. మాకు ప్రభుత్వ పథకం రాలేదు.... ఎలా ఏ సమస్య ఉన్నా సచివాలయంలో కంప్లైంట్ ఇవ్వండంటూ.. మొన్నటి వరకు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు చెప్పేవారు. ఇది ఏ మారుమూల వార్డులోని ప్రజలను అడిగిన చెప్పే మాట. పథకాలకు నిధులు విడుదల, ప్రచారాలలో కనిపిస్తూ సొంత కాంట్రాక్టు పనులు చేసుకుంటూ హాయిగా గడిపేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీరు మార్చుకున్నారు. పెండింగ్ పనులకు ప్రస్తుత ప్రభుత్వం సహకరించడం లేదంటూ నిందలు వేయడం మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిన్న చిన్నపనులు చేయాలంటే నిధులు విడుదల చేయడం లేదు, టెండర్లు పిలిచినా పనులు పూర్తిచేయాలంటే నిధులు నిలబెట్టారు అంటూ గగ్గోలు మొదలుపెడుతూ వస్తున్నారు. అదే విధంగా సోమవారం కూడా మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ అధికారులు లేరు, దీంతో చిన్నచిన్న పనులు కావడం లేదు, అభివృద్ధి కుంటుపడుతోందంటూ ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపాలిటీని చిన్నచూపు చూస్తోందంటూ మున్సిపల్ కమిషనర్ ముందు నినందించారు. పనులకు అగ్రిమెంట్లు చేయాలన్నా, బిల్లులు పెట్టాలన్న ఇంజనీరింగ్ అధికారులు సంతకం చేయాల్సి ఉందన్నారు. పులివెందుల అభివృద్ధిని, ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగాన్ని నియమించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ పాలక వర్గం పులివెందుల అభివృద్ధి కోసం అధికారులను నియమించాలని నిరసన వ్యక్తం చేయడంపై పలువురు ప్రజలు, అధికారులు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లపాటు నిధులు వరదలాపారినా విద్యుత్ శాఖకు దాదాపు రూ.30కోట్ల దాకా బకాయిలు ఎందుకు పడ్డారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. దీనిని కూడా కూటమి ప్రభుత్వంపై నెపం నెట్టి... డబ్బులు ఇవ్వలేదు వీధిలైట్లు వెల గడం లేదని చెప్పడం సరికాదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు.

'శారీరక విభిన్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండండి'

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శారీరక విభి న్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండాలంటూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు ఆర్వీ క్రిష్ణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో కొందరు దళారులు మూడు చక్రాల స్కూటర్లు తక్షణం అందిస్తామని హామీ ఇచ్చి అర్హులైన వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ కార్యాలయం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి ప్రకటనల్లో ఎటువంటి నిజం లేదన్నారు. ప్రజలు ఇటువంటి వదంతులు నమ్మకుండా, మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ఆదేశాలు కానీ.. బడ్జెట్ కేటాయింపులు కానీ జారీ చేయలేదన్నారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన తరువాతనే దరఖాస్తుల ప్రక్రియ చేపట్టి అర్హులను గుర్తించి యూనిట్ల కేటాయింపులు పూర్తి పారద ర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయమై పూర్తి సమాచారాన్ని పత్రికల ద్వారా ప్రకటిస్తామని వివరించారు. ఈ రకమైన మోసపూరిత చర్యలకు ఈ కార్యాలయానికి, సిబ్బందికి ఎటువంటి సంబంధంలేదని తెలిపారు. ఎక్కడైనా డబ్బులు వసూలు చేస్తున్న సంఘటనలు తమ దృష్టికి వస్తే సంబంధిత వివరాలను సమగ్రంగా సేకరించి లిఖితపూర్వక ఫిర్యాదులు చేయాలన్నారు. అటువంటి ఫిర్యాదులపై చట్టనిబంధనల ప్రకా రం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయస్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలో విజేతగా పవన్‌కళ్యాణ్



పవన్‌కళ్యాణ్‌ను సత్కరిస్తున్న కృష్ణకిశోర్

కడప కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలలో కడపలోని ఓ ప్రయివేటు స్కూల్‌లో ఆర్ట్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బండి పవన్‌కళ్యాణ్ వేసిన పెయింటింగ్ జాతీయస్థాయిలో ఉత్తమ పెయింటింగ్‌గా నిలిచి గోల్డ్‌మెడల్, గోల్డెన్ బ్రష్ ఆర్టిస్ట్ టైటిల్ గెలు పొందాడు. ఆ మేరకు పవన్‌కళ్యాణ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంబంధిత అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్వీ కృష్ణకిశోర్ సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురష్కరించుకుని గత మే 7న మన దేశం క్రియేటివ్ ఆర్ట్స్ హార్ట్స్ అకాడమీ వారు ఏర్పాటు చేసిన పెయింటింగ్ పోటీలలో పవన్‌కళ్యాణ్ విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షైభారత్ (నెహ్రూరా కేంద్రం) సిబ్బంది ప్రేమ్, మదర్‌థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవానికి దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం



బ్రహ్మంగారిమఠం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలో ఆగస్టు 6వ తేదీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల మాస కల్యాణ మహోత్సవానికి సంబంధించి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు మఠం దేవస్థాన ఫిట్ పర్సన్ శంకర బాలాజీ తెలిపారు. కల్యాణ మహోత్సవానికి మంత్రిని హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం మంత్రి కల్యాణమహోత్సవ ఆహ్వానపత్రికను ప్రదర్శించారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి 41 నోటీసు

చిన్నమండెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో 41 నోటీస్ ఇచ్చారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేశాడంటూ నమోదైన కేసును చిన్నమండెంకు బదిలీ చేయగా మాజీ ఎమ్మెల్యేను మదనపల్లె నుంచి సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌కు తరలించి 41 నోటీసు ఇచ్చి పంపించారు.

అన్నమయ్య జిల్లా బీజేపీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా శ్రీనివాసులరెడ్డి

గాలివీడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బీజేపీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా శ్రీనివాసులరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. తాను ఎగ్జిక్యూటీవ్ మెంబర్ అయ్యేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఒంటిమిట్ట ఎంపీపీగా తిరిగి బాధ్యతలు చేపట్టిన లక్ష్మీదేవి

ఒంటిమిట్ట జూలై 21 (ఆంధ్రజ్యోతి):ఒంటిమిట్ట ఎంపీపీగా అక్కి లక్ష్మీదేవి బాధ్యతలు చేపట్టారు. అనారోగ్య కారణంగా ఈ యేడాది ఏప్రిల్ 23వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు సెలవు పెట్టారు. సెలవు కాలం పూర్తి కావడంతో సోమవారం సాయంత్రం ఆమె తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సుజాతమ్మ, ఈవోపీఆర్డీ ప్రసాద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

రసవత్తరంగా మల్టీడే క్రికెట్ పోటీలు



కశ్యప్‌రెడ్డి, గైబు, దినేష్

కడప స్పోర్ట్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కడప జట్టుపై నెల్లూరు జట్టు 11 పరుగుల ఆధిక్యత సాధించగా, మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు 56 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా.....

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలిరోజు టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో కేవలం 78 పరుగులకే కుప్పకూలింది. బౌలింగ్ విభాగంలో కడప జట్టు బౌలర్లు కశ్యప్ రెడ్డి, గైబు చెరీ 5 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 38.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో లోకేష్ 55 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 62 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టి 73 పరుగులు చేసింది. దీంతో ఇప్పటివరకూ నెల్లూరు జట్టుకు 11 పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు చేపట్టి.. తన మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులకే చేతులెత్తేసింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ దినేష్ ఏకంగా 6 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అక్తర్ 81 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టుకు 56 పరుగుల ఆధిక్యత లభించింది.

చిన్నారికి టీకా.. తగ్గని వాపు

● గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేసిన తల్లి



టీకా వేయడంతో చిన్నారి భుజంపై ఏర్పడ్డ గడ్డ

చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంపాడు పంచాయతీకి చెందిన శ్రీహర్షితరెడ్డి అనే 16 నెలల చిన్నారికి ఈ నెల 9న సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎం వెంకటసుబ్బమ్మ ఓ టీకా వేసింది. అయితే టీకా ఇచ్చిన మరుసటిరోజే పాప భుజంపై చిన్నపాటి గడ్డలా మారింది. దీంతో భయపడ్డ ఆ చిన్నారి తల్లి రూప ఏఎన్ఎం వద్దకు వెళ్లి గట్టిగా అడగ్గా అదేమీ కాదు మానిపోతుంది, ఆందోళన వద్దు అని చెప్పడం జరిగింది. అయితో రోజులు గడిచే కొద్దీ తగ్గకపోవడంతో ఆమె కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆశ్రయించింది. అక్కడ పరిశీలించిన వైద్యులు నయం అయ్యేందుకు సమయం పడుతుందని కొందరు, ఏమో చెప్పలేమని ఇంకొందరు రకరకాలుగా చెప్పడంతో భయపడ్డ ఆ తల్లి సోమవారం కలెక్టరు కార్యాలయంలో గ్రీవెన్‌సెల్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వినయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

వైసీపీని నమ్మాం... నట్టేట మునిగాం



పోతబోలు కాలనీ వ్యూ

- సమస్యల వలయంలో పోతబోలు కాలనీ
- అన్నింటికీ ఆరు కిలోమీటర్లు వెళ్లాల్సిందే
- ఇంకెంత కాలం ఎదురుచూపులు
- పాలకులు, అధికారులు సమస్యను పరిష్కరించాలి

మదనపల్లె టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'పూర్తి వసతులతో అందరికీ అందుబాటులో నివసించేందుకు ఇండ్లు కట్టిస్తాం, పేదలకు సొంతింటి కలను నెరవేరుస్తామని' వైసీపీ పాలకులు గట్టిగట్టిగా ప్రకటనలు ఊదరగొట్టారు. దీన్ని నమ్మిన ప్రజలు ఇండ్లు కట్టిస్తామంటే ఎక్కడి పరుగులు పెట్టాని చెప్పినా గుడ్డిగా పరిగెత్తారు. పట్టణంలో బాడుగలు చెల్లించే కన్నా చిన్నదైనా సొంతింట్లో ఉంటామనే ఊదరగొట్టే మాటలు చెవుల్లో గింగురులు తిరుతున్నాయి, ఆశ వారి కళ్లకు పొరలై కూచుంది. దీంతో పట్టణంలో నివసించే పేదలు ఇంటి పట్టాలు ఇస్తున్నారంటూ పట్టణానికి ఆరుకిలోమీటర్ల దూరంలోని పోతబోలుకు పరుగు లంఘించుకున్నారు. అయితే అతికష్టమ్మీద అక్కడ ఇళ్లయితే నిర్మించుకున్నారు కానీ ప్రతి చిన్నప నికీ డబ్బుతో ముడిపడిందని, రెక్కల కష్టం పంచేందుకే సరిపోవడంలేదని ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది. చివరికి ఇంటి అవసరాలకు సైతం నీరు కావాలన్నా కొనాల్సి వస్తోంది. ఈ కాలనీకి ప్రత్యేకంగా విద్యుత్ లైన్లు వేశారే కానీ, 24 గంటల విద్యుత్ సరఫరా వుండడం లేదని ఆనక తెలిసింది. చేతులు కాలాక చేయాల్సిన పనిలేదని తెలిసొచ్చేసరికి బతుకులు తెల్లారాయని పలువురు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా కాపురముంటున్న ప్రజలు నేటికీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా కరుణించి కనీస వసతులైనా కల్పించాలని కోరుతున్నారు. వివరాల్లోకెళితే....

వైసీపీ ప్రభుత్వంలో హౌసింగ్ కాలనీల్లో అతిపెద్ద కాలనీగా రూపుదిద్దుకుంది మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీలోని బూచుపల్లె కాలనీ. పట్టణంలోని పేదల కోసం నవరత్నాల పథకం కింద 1000 మందికి హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేశారు. వందెకరాలకు పైగా వున్న ఈ కాలనీలో 1000 ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేశారు. సుమారు 350 మంది ఇళ్లు నిర్మించుకుని అందులో చేరారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. తాగునీటి సౌకర్యం కోసం నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేసినా, బోర్ల నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులకు పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ప్రజలు రూ.800 పెట్టి తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదు. వర్షం కురిస్తే రోడ్లన్నీ బురదమయమై నడవడానికి కూడా వీల్లేకుండా పోతోంది.

మౌలిక వసతులు కరవు

ప్రజలకు ప్రధానంగా అందుబాటులో వుండాల్సినవి విద్య, వైద్యం, ఆలయాలు. పోతబోలు కాలనీ ఈ మూడింటికీ ఆరు కిలోమీటర్ల దూరంలోనే వుండిపోయింది. 350 కుటుంబాల్లో 1500 మంది నివసిస్తున్నారు. 400 మంది విద్యార్థులున్న ఈ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయలేదు. 50 మంది చిన్నారులున్నా కనీసం అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయలేదు. దగ్గు వచ్చినా వైద్యం అందించే హెల్త్ సెంటర్ లేదు. ప్రతి నెలా నిత్యావసరాల కోసం బూచేపల్లె, తట్టివారిపల్లెకు వెళ్లాల్సిందే. ఈ కాలనీలో ఆలయం, మసీదులకు వెళ్లాలన్నా తట్టివారిపల్లెకు వెళ్లాల్సిందే. పట్టణంలోని తమ ఓట్లను, ఆధార్ కార్డును ప్రజలు పోతబోలు గ్రామానికి మార్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీకి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలకు అధిక చార్జీలు ఇచ్చి ప్రయాణం చేయాల్సి వస్తోంది.

పంచాయతీకి నిధులు లేవు..

పట్టణంలో నివసిస్తున్న పేదలకు పోతబోలు పంచాయతీ పరిధి కాలనీలో ఇళ్లు మంజూరు చేశారు. ఇక్కడ ప్రజల మౌలిక వసతులు కల్పించడానికి పంచాయతీలో నిధులు లేవు. ఇంటిపన్ను అసెస్‌మెంట్ జరగలేదు. ఆదాయం లేకపోగా ఖర్చులు భరించలేమని పంచాయతీ పాలకులు చేతులెత్తేశారు. మున్సిపల్ అధికారులైనా సౌకర్యాలు కల్పిస్తారనుకుంటే ఇది తమ పరిధిలో లేదని మున్సిపల్ అధికారులు ముఖం చాటేస్తున్నారు. రెంటికి చెడ్డ రేవడిలా పోతబోలు కాలనీ ప్రజల అవస్థలు వున్నాయి.



పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలతో అంతర్గత రోడ్లు



బురదమయం ప్రధాన రోడ్డు



ఓవర్‌హెడ్ ట్యాంకుకు అర్ధంతరంగా వదిలేసిన పైప్‌లైన్ కనెక్షన్

విషపురుగులతో సావాసం



కాలనీలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. రాత్రిళ్లు వీధిలైట్లు వెలగడం లేదు. మబ్బులు పడితే విషపురుగులు పారాడుతుంటాయి. వీటితో సావాసం చేయలేక, అలికిడివస్తే మెలకువ వచ్చి టార్చిలైట్లతో వెతుకులాడుతు న్నాం. మా సమస్యలు పట్టించుకునే నాథుడే లేడు.

భాస్కర్ రెడ్డి పోతబోలు కాలనీ

డబ్బిచ్చి నీళ్లు కొంటున్నాం



కాలనీలో పెద్దట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వలేదు. డైరెక్ట్ బోరు నీళ్లు వస్తే సరి, లేకుంటే నీళ్ల ట్యాంకుకు రూ.800 ఇచ్చి కొంటున్నాం. బోర్లకు పైప్‌లైన్లు బిగించినా ట్యాంకులకు నీళ్లు పంపింగ్ చేయడం లేదు. టౌన్‌లో ఇంటి బాడుగ ఇవ్వలేక, ఇక్కడికి వస్తే నీళ్ల కోసం నాలుగు వేలు ఖర్చు వస్తోంది.

భారతి , పోతబోలు కాలనీ

చార్జీలు భరించలేకున్నాం



కాలనీ నుంచి మదనపల్లెకు రాను, పోను ఆటోలకు ఒకరికి రూ.50 ఖర్చు చేయాలి. ఇంట్లో పనికి వెళ్లే మేము, బడికి వెళ్లే పిల్లలకు ఎంత లేదన్నా నెలకు రూ.5వేలు చార్జీలు పెట్టాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సు వేస్తే ఆడోళ్లకైనా ఫ్రీ చార్జీలు వస్తాయేమో.

రూపేష్, పోతబోలు కాలనీ

కంభం కుటుంబానికి అండగా ఉంటాం

- మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి భరోసా



కంభం నిరంజన్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, సోదరుడు నల్లారి సంతోష్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం కంభంవారిపల్లెలో నిర్వహించిన నిరంజన్‌రెడ్డి తండ్రి కంభం ప్రభాకర్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి నల్లారి సోదరులు హాజరై కంభం ప్రభాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మాజీ సీఎం తనయుడు నల్లారి నిఖిలేష్ కుమార్‌రెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, ప్రభుత్వ అధికారులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, కంభం కుటుంబీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కలకడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పశువైద్య సిబ్బంది సమయ పాలన పాటించి పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలని డీడీఏహెచ్ డాక్టర్ మాలకొండయ్య ఆదేశించారు. సోమవారం ఆయన కలకడ పాపి రెడ్డిగారిపల్లె పశువైద్య శాల, కత్తివారిపల్లె రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంతకమునుపు గంగాపురంలో ఆవులకు లంపిస్కిన్ నివారణ టీకాలు వేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఈ వ్యాధి బారినపడిన పశువులకు శరీరంపై బొబ్బలు ఏర్పడి తీవ్రజ్వరం వస్తుందన్నారు. పాల ఉత్పత్తి తగ్గి రైతులు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టీకా సదుపాయాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో పశువులకు ప్రాణ నష్టం సమాచారాన్ని సిబ్బందికి తెలపాలన్నారు. ఏడీ క్రిష్ణయ్య, డాక్టర్లు తేజకల్యాణ్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ కార్మికుల ఎంప్లాయీస్ యూనియన్ 327 నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ఏపీఎస్ ఈఈ యూనియన్ 327 సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మురళి రామకృష్ణ, గౌరవాధ్యక్షుడుగా గోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు డిస్కమ్ కార్యదర్శి షణ్ముగం, రీజనల్ కార్యదర్శి మురళీధర్, డివిజన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుదాం

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దానియేల్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి దానియేల్ మాదిగ

పీలేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో నిర్మాణాన్ని బలోపేతం చేసుకుని భవిష్యత్ పోరాటాలకు సిద్ధం అవుదామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోట దాని యేల్ మాదిగ పిలుపునిచ్చారు. పీలేరులో నియోజక వర్గ స్థాయి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుసంబధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా విద్య, ఉద్యోగ, రాజకీయ ఇతర రగాల్లో మాదిగలు అభివృద్ధిలోకి వస్తారని చెప్పారు. జాతికోసం, సమాజం కోసం మాదిగ విద్యార్థులు, యువకులు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. జిల్లా కో ఇన్‌చార్జి రవీంద్ర మాదిగ, పీలేరు ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, శ్రీరాములు, వెంకట్రమణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

విధుల సమయం పాటించాలి

పీలేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమయానికి విధులకు హాజరు కావాలని పీలేరు ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ ధనంజయులు తెలిపారు. పీలేరు గ్యారేజ్‌లో ఉద్యోగులు, కార్మికులతో ఆయన మాట్లాడుతూ వర్షాలు పడు తున్నందున డ్రైవర్లు రోడ్డు పరిస్థితిని గుర్తించి బస్సులు జాగ్రత్తగా నడపాలని సూచించారు. డిపో ఈపీకే, కేఎంపీఎల్ పెంచడంలో డ్రైవర్, కండక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆర్టీసీపై ప్రయాణీకుల్లో నమ్మకాన్ని మరింత పెంచేలా వ్యవహార శైలి మార్చుకో వాలని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలి



ఐసీడీఎస్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీ మహిళలు

వాల్మీకిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్)విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని అంగన్వాడీ మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ విధానం కష్టతరం అవుతుందన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా ప్రీ స్కూల్ కార్యక్రమాలు కుంటు పడుతున్నాయన్నారు. ఎఫ్ఆర్ఎస్ ఇబ్బందులతో లబ్ధిదారులు కూడా తగ్గిపోయే పరిస్థితులు ఉన్నందున ప్రభుత్వం స్పందించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ మహిళా నేతలు చంద్రావతి, భూకైలేశ్వరి, పద్మశ్రీ, అమ్మాజి, లక్ష్మీదేవి, రెడ్డిరాణి, గులాబ్‌జాన్, విజయకుమారి, ప్రాజెక్టు పరిధిలోని వివిధ మండలాల మహిళ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ విధానంతో విధులకు కష్టం...

మదనపల్లె టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ లబ్ధిదారులకు ఎఫ్ఆర్ఎస్ విధానంతో పౌష్టికాహారం పంపిణీ విధానం ఎత్తి వేయాలని అంగన్‌వాడీ వర్కర్లు, లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, లబ్ధిదారులు చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ లబ్ధిదారులు రాణి, షేక్ అర్షియా, సుజాత, సుధారాణి, శోభ, నిర్మల, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'పీ4' కుటుంబాలను గుర్తించాలి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్, తదితరులు

నిమ్మనపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న 'పీ4' (ప్రభుత్వ ప్రైవే టు ప్రజల భాగస్వామ్యం) పథకంలో అర్హులైన కుటుంబాలను గుర్తించాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. సోమవారం కార్యదర్శులు, వెల్‌ఫేర్ అసిస్టెంట్లతో ఆయన మాట్లాడుతూ 'పీ4' పథకంలో ఇప్పటి వరకు 506 కుంటుబాలను గుర్తించామన్నారు. వెనుకబడి అట్టడుగున వున్న 20శాతం కుటుంబాలను గుర్తించి వారిని దత్తత తీసుకుని ఆర్థిక సమానతలు రూపుమాపడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. లబ్ధిదారుని ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పీ4'పై గ్రామసభలు

ములకలచెరువు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి 'పీ4'పై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. 22న బురకాయలకోట, మద్దినాయనిపల్లె, సెంట్రల్‌స్కూల్, ములకలచెరువు, 23న పాత ములకలచెరువు, పెద్దపాళ్యం, పర్తికోట, దేవళచెరువు, 24న సోంపల్లె, 25న వేపూరికోట, కోనేటివారిపల్లె, చౌడసముద్రం, గూడుపల్లె, కదిరినాథునికోట, నాయనిచెరువుపల్లె, 30న కాల్వపల్లెల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. తుది జాబితా రూపకల్పనకు సభలు నిర్వహిస్తున్నామన్నారు.

చంద్రబాబు సుపరిపాలనలో ప్రజాసంక్షేమం

బి.కొత్తకోట, జూలై21(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా, ప్రశాంతంగా ఉందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీలో భాగంగా సోమవారం బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. పట్టణంలో నాలుగైదు రోజులుగా నీరు రావడం లేదని ప్రజలు జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటూ కమిషనర్ పల్లవిని ఆదేశించారు.

డెంగీ నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకం

మదనపల్లె అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): డెంగీ నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి కలీలుల్లాఖాన్ అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దొంతివీధి, త్యాగరాజవీధి, కాలనీ గేట్, సొసైటీ కాలనీ, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, దక్కినీపేట ఉర్దూ హైస్కూల్ విద్యార్థులకు డెంగీ జ్వరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు.

ఆలయం పక్కనే మద్యం విక్రయాలు...?

గుర్రంకొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీ వద్ద ఉన్న సాయిబాబా ఆలయం పక్కనే మద్యం విక్రయిస్తుండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయం పక్కన, ముందర రేకుల బంకు ఏర్పాటు చేసుకుని చిల్లర దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఈ దుకాణాల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగిస్తున్నారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు మందుబాబులతో ఇబ్బంది పడుతున్నట్లు మహిళలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సివుంది.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ములకలచెరువు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరసింహుడు హెచ్చరించారు. ములకలచెరువు, పెద్దపాళ్యంలో సోమవారం వాహనదారులు, ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జాతీయ రహదారిలో వాహనాల వేగం పరిమితికి మించితే చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌కు టమోటాలు తీసుకెళ్లే వాహనాలు అతి వేగంగా వెళ్లి ప్రమాదాలకు కారణం కావద్దన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం నియామకం



పీలేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నిమ్మనపల్లె పురుషోత్తంను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పడానికి తానే నిదర్శనమని తెలిపారు. శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతం కోసం శ్రమిస్తానన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

వాల్మీకిపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయం లో ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆడికృత్తిక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మ ణ్య స్వాములకు విశేషాలంకరణలు చేసి వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యా ఘోష, భక్తజనం నడుమ కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నీటి సమస్య తీర్చండి

మదనపల్లె టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా తాగునీటి సమస్య తో అల్లాడుతున్నాం, అధికారులకు చెప్పి చూసినా పట్టించుకోలేదంటూ ములకలచెరువు మండలం దానిరెడ్డిగారిపల్లె ప్రజలు నిరసన తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ వద్ద గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి బోరులో నీరు అడుక్కి వెళ్లిపోయిందని, లోతు పెంచేలా అదనపు పైపు లు దించాలని ఎంపీడీఓకు విన్నవించామన్నారు. ఆరునెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా మా గోడు వినేవాడు లేడన్నారు. ఇప్పటికైనా అధికారు లు మా సమస్యలు పరిష్కరించాలని ఆందోళన వ్యక్తం చేశారు.

అవిశ్వాసం ఆమోదించినా... ఉప సర్పంచ్ తొలగలేదు



ఫిర్యాదు చేస్తున్న కురవంక వార్డుసభ్యులు

మదనపల్లె టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉపసర్పంచ్ బైగారి భారతిపై అవిశ్వాస తీర్మానం మెజారిటీ సభ్యులు ఆమోదించినా ఆమె పదవి నుంచి తప్పుకోవడం లేదని కురవంక వార్డు సభ్యులు సబ్ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో డీఏఓ నిర్మలాదేవికి వార్డు సభ్యులు నాగరాజు, కృష్ణమూర్తి తదితరులు ఫిర్యాదు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, బోర్డు మీటింగ్‌లకు హాజరవడం లేదన్నారు. కాబట్టి ఆమె స్థానంలో మరొకరిని ఎన్నుకోవాలని సభ్యులు తీర్మానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రుణాలు చెల్లించ లేదంటూ ఫిర్యాదు

బి.కొత్తకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాకాటంవారిపల్లెలో డ్వాక్రా సంఘాల వ్యవహారం రచ్చకెక్కింది. గ్రూపులీడర్లు, సంఘమిత్రలు ఆర్థికలావాదేవీల్లో పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రచ్చకెక్కారు. పలువురు డ్వాక్రా మహిళలు సోమవారం రాయచోటికి వెళ్లి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిశారు. గ్రామసమాఖ్యలో 33 మహిళాసంఘాల్లో మోక్షిత, వరలక్ష్మి, అక్షర గ్రూపుల లీడర్లు సంఘం పేరుతో రుణాలు తీసుకుని సొంత అవసరాలకు వాడుకున్నారని ఫిర్యాదు చేశారు. రుణాలను తిరిగి చెల్లించకపోగా గొడవలు చేయిస్తున్నారని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పేర్కొన్నారు.